ప్రతి అక్షరం - ప్రజల కోసం

# రోమింగ్ న్యూస్

యాదాద్రి భువనగిరి

తెలుగు దినపత్రిక

పేజీలు : 8
సంపుటి : 4
సంచిక : 108

సోమవారం 3 నవంబర్ 2025 / చీఫ్ ఎడిటర్ : గొట్టిపర్తి భాస్కర్ / HYDERABAD, KARIMNAGAR, KHAMMAM, NALGONDA, NIZAMABAD, WARANGAL, MAHABUBNAGAR.RANGAREDDY, MEDAK, ADILABAD







మహిళా క్రికెట్‌లో సరికొత్త చరిత్ర
తొలిసారి మహిళల వన్డే వరల్డ్ కప్ మనదే!
ఫైనల్లో సత్తా చాటిన ఉమెన్స్
సౌత్ ఆఫ్రికన్స్‌ను మట్టికరిపించిన భారత్

# ఉమెన్స్ వరల్డ్ కప్ మనదే

(గొట్టిపర్తి వృతిక్) రోమింగ్ న్యూస్ ప్రత్యేక ప్రతినిధి, నవీ ముంబై: దశాబ్దాల కల సాకారమైంది! భారత మహిళల క్రికెట్ జట్టు తొలిసారిగా ఐసీసీ మహిళల వన్డే వరల్డ్ కప్‌ను గెలుచుకుంది. నవీ ముంబైలోని డీవై పాటిల్ స్టేడియం వేదికగా నవంబర్ 2, 2025న జరిగిన ఫైనల్‌లో, మన అమ్మాయిలు సౌత్ ఆఫ్రికాపై 52 పరుగుల తేడాతో ఘన విజయం సాధించి చరిత్ర సృష్టించారు. 1972లో జట్టు ఏర్పడిన నాటి నుంచి భారత క్రికెట్ అభిమానులు ఎంతగానో ఎదురుచూసిన కల నేడు నిజమైంది.

**బ్యాటింగ్ మెరుపులు: ఇండియా 298**

ముందుగా బ్యాటింగ్ చేసిన టీమిండియా, నిర్ణీత ఓవర్లలో 298 పరుగులు చేసింది.

షఫాలీ వర్మ (87 పరుగులు) ఆరంభంలో విధ్వంసకర ఇన్నింగ్స్‌తో బలమైన పునాది వేశారు.

ఆ తర్వాత, దీప్తి శర్మ (58 పరుగులు) అద్భుతమైన అర్ధ సెంచరీతో జట్టు స్కోరును భారీ లక్ష్యం వైపు నడిపించారు.

**బౌలింగ్‌లో మాయాజాలం: దీప్తి మ్యాజిక్**

299 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన సౌత్ ఆఫ్రికా జట్టు, భారత బౌలర్ల ధాటికి తట్టుకోలేకపోయింది.

దీప్తి శర్మ తన స్పిన్ మాయాజాలంతో కీలక సమయంలో 5 వికెట్లు తీసి ప్రత్యర్థి నడ్డి విరిచింది. ఆల్‌రౌండర్‌గా మెరిసిన షఫాలీ వర్మ కూడా 2 కీలక వికెట్లను తన ఖాతాలో వేసుకుంది. శ్రీ చరణి బౌలింగ్‌లో మంచి సహకారం అందించింది.

**హర్మన్‌ప్రీత్... విజయ కెప్టెన్**

గతంలో రెండుసార్లు (2005, 2017) ఫైనల్‌లో ఓటమి బాధను అనుభవించిన ఈ జట్టు, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ నాయకత్వంలో ఈసారి కప్పును అందుకుంది. ఈ ఐదు ప్రపంచ కప్‌లు ఆడిన అనుభవం ఉన్న హర్మన్, దేశానికి తొలి ప్రపంచ కప్‌ను అందించిన తొలి భారత మహిళా కెప్టెన్‌గా చరిత్రలో సుస్థిర స్థానం సంపాదించుకున్నారు. విజయం తర్వాత ఆమె కళ్ళలో కనిపించిన ఆనందబాష్పాలు, దశాబ్దాల పోరాటానికి నిదర్శనం. కోట్లాది భారతీయుల కల నెరవేరిన అపూర్వ క్షణం ఇది.

7




# నింగిలోకి ఎల్వీఎం3-ఎం5

## భారత గడ్డపై నుంచి తొలి భారీ ఉపగ్రహం

ఎల్వీఎం3-ఎం5 రాకెట్ ప్రయోగం విజయవంతం
16.29 నిమిషాల్లోనే కక్ష్యలోకి సీఎంఎస్-03 శాటిలైట్
భారీ ఉపగ్రహ ప్రయోగంతో కొత్త చరిత్ర సృష్టించిన ఇస్రో
ఎల్వీఎం3 ప్రయోగాల్లో వరుసగా ఎనిమిదో విజయం చరిత్రలో మైలురాయి: ఇస్రో చైర్మన్ నారాయణన్
నిప్పులు చిమ్ముతూ నింగిలోకి దూసుకెళ్తున్న ఎల్వీఎం3-ఎం5 రాకెట్




4



# ఆపరేషన్ సిందూర్ నుంచి వారింకా తేరుకోలేదు

పాక్‌పై బాంబులేస్తే.. కాంగ్రెస్ రాచకుటుంబానికి నిద్ర లేదు: మోదీ
పట్నాలో భారీ రోడ్‌షో
బిహార్ మహాగఠ్ బంధన్‌లో తీవ్ర విభేదాలు
వారి మేనిఫెస్టో అబద్ధాల పుట్ట: ప్రధాని



4

పాకిస్థాన్‌లో పేలుళ్లు సంభవిస్తే కాంగ్రెస్ 'రాచకుటుంబా'నికి నిద్ర దూరమైందని ప్రధాని మోదీ ధ్వజమెత్తారు. 'ఆపరేషన్ సిందూర్' నుంచి పాక్‌తోపాటు కాంగ్రెసలోని పేరుగొప్ప నాయకులు ఇంకా తేరుకోలేదని ఎద్దేవా చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఆయన అర్రాలో జరిగిన సభలో మాట్లాడారు. పట్నాలో భారీ రోడ్‌షో నిర్వహించారు.

# పెద్ద వ్యాపారుల చేతిలో మోదీ రిమోట్ కంట్రోల్

చిన్న వ్యాపారులను నాశనం చేసి బడా వ్యాపారవేత్తలకు మేలు చేయడమే మోదీ లక్ష్యం
దానిలో భాగంగానే జీఎస్టీ, నోట్ల రద్దు
బిహార్ ఎన్నికల ప్రచారంలో రాహుల్ గాంధీ
చెరువులో దిగి చేపలు పట్టిన ప్రతిపక్ష నేత
18న సీఎంగా ప్రమాణం చేస్తున్నా: తేజస్వి



4

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అంటే భయపడటమే కాకుండా పెద్ద వ్యాపారవేత్తలు ఆడించినట్టల్లా ఆడుతున్నారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఆదివారం బిహార్‌లోని బెగూసరాయ్, ఖగారియా జిల్లాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభల్లో రాహుల్

# గణేష్‌కు పునర్జన్మనిచ్చిన రాజన్న

చిన్నకొండూరు గణేష్ కు పునర్జన్మనిచ్చిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి
పేదింటి యువకుని ప్రాణాలు కాపాడిన కోమటిరెడ్డి రాజ గోపాల్ రెడ్డి
తన సొంత నిధులు వెచ్చించి రూ.12,500, 00 రూపాయలతో యువకునికి కార్పొరేట్ వైద్యం

చౌటుప్పల్, రోమింగ్ న్యూస్: కామినేని ఆసుపత్రిలో కిడ్నీ మార్పిడి చికిత్స చేయించిన రాజ్ గోపాల్ రెడ్డి తన ఉదారతను చాటుకున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని శాసనసభ్యులలో ఎవరికి లేని దాతృత్వాన్ని కలిగి ఉన్నాడని మ-రోసారి నిరూపించుకున్నారు. రాజగోపాల్ రెడ్డి చేసిన సహాయానికి జీవితాంతం రుణపడి ఉంటామంటున్న కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రాజన్న చేసిన సాయం ఆ నోట ఈ నోట తెలుసుకున్న మునుగోడు నియోజకవర్గ ప్రజలు హర్షిస్తున్నారు. వివరాల్లోకి వెళితే... మునుగోడు నియోజకవర్గంలోని చౌటుప్పల్ మండలం చిన్న




కొండూరు గ్రామానికి చెందిన నిరుపేద యువకుడు నెల్లి గణేష్(26) గత కొద్ది కాలంగా కిడ్నీ సంబంధిత సమస్యతో ఇబ్బంది పడుతున్నాడు.. కిడ్నీలు దెబ్బతిన్నాయని కిడ్నీ మారిస్తే కానీ బ్రతకడని డాక్టర్లు చెప్పారు.. కిడ్నీ మార్పిడి చికిత్సకు లక్షల రూపాయలు ఖర్చవుతాయని కూడా చెప్పారు.. తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు అంత డబ్బు తమ దగ్గర లేకపోవడంతో భగవంతునిపై భారం వేసి రోజులు వెలదీస్తున్నారు.. నెల్లి గణేష్ ఆరోగ్యం రోజురోజుకు క్షీణిస్తుండడంతో విషయాన్ని స్థానిక నాయకులు గౌరవ మునుగోడు శాసనసభ్యుల దృష్టికి తీసుకువచ్చారు.. వెంటనే తన వ్యక్తిగత సిబ్బందిని ఆసుపత్రికి పంపించి కిడ్నీ మార్పిడి చికిత్స చేయడానికి కావలసిన ఏర్పాటు చూడాలని ఆదేశించారు... 12. 50 లక్షల రూపాయలను కామినేని ఆసుపత్రికి చెల్లించి గణేష్ కు కిడ్నీ మార్పిడి చికిత్స చేయించారు. చికిత్స అనంతరం ఆదివారం కామినేని ఆసుపత్రికి వెళ్లి గణేష్ బాగోగులు తెలుసుకున్నారు.. గణేష్ కుటుంబ సభ్యులకు నేనున్నాను మీరు ధైర్యంగా ఉండండి అని భరోసా ఇచ్చారు.. తన కుమారునికి సొంత ఖర్చులతో కిడ్నీ మార్పిడి చికిత్స చేయించి కార్పొరేట్ వైద్యం అందించిన రాజగోపాల్ రెడ్డి గారికి గణేష్ తల్లిదండ్రులు చేతులెత్తి నమస్కరించారు.. నా కుమారునికి పునర్జన్మ ప్రసాదించావన్నారు నెల్లి గణేష్ కు సొంత ఖర్చులతో కిడ్నీ మార్పిడి చికిత్స చేయించడంతో మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఉదార స్వభావానికి సహాయం చేసే గుణానికి నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



కామినేని హాస్పిటల్లో గణేష్‌ను పరామర్శిస్తున్న మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి





## రాజధానిలో దంచి కొట్టిన వాన

**జలమయమైన రోడ్లు.. పలు చోట్ల ట్రాఫిక్ జామ్**

**మరో రెండు రోజులు మోస్తరు నుంచి భారీ వర్షాలు**

**హైదరాబాద్ సిటీ, నవంబరు 2 :** రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌ను మరోసారి భారీ వర్షం ఇబ్బందుల పాల్జేసింది. ఆదివారం సాయంత్రం సుమారు 20 నిమిషాల పాటు ఆగకుండా దంచికొట్టింది. ఉదయం నుంచి పొడి వాతావరణం ఉన్నప్పటికీ.. సాయంత్రం భారీ వర్షం కురిసింది. మొంథా తుఫాను ప్రభావంతో గత నెల 28న రాత్రి నుంచి 29వ తేదీ రాత్రి వరకు తెరిపిలేకుండా భారీ వర్షం కురిసింది. ఈ క్రమంలో మరోసారి భారీ వర్షం అవస్థలు సృష్టించింది. ఫిల్మ్‌నగర్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, మాదాపూర్, మాసబ్‌ట్యాంక్, ఖైరతాబాద్, పంజాగుట్ట, చిక్కడపల్లి, సికింద్రాబాద్, బేగంపేట్, మియాపూర్, లింగంపల్లి, కూకట్‌పల్లి తదితర ప్రాంతాల్లో రోడ్లపై వరద ప్రవహించడంతోపాటు గుంతల్లో నీరు నిలిచిపోయింది. మాసబ్‌ట్యాంక్ బంజారాహిల్స్ మార్గంలో, జూబ్లీహిల్స్ నుంచి మాదాపూర్, హైటెక్‌సిటీ రోడ్డులో, మెహిదీపట్నం-అమీర్‌పేట్, ఉప్పల్-నాగోల్ మార్గాల్లో, మియాపూర్‌లో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. కేవలం ఇరవై నిమిషాల పాటు కురిసిన వర్షానికే అమీర్‌పేట్, బేగంపేట్, సికింద్రాబాద్‌లోని లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచింది. నగరంలో మరో రెండు రోజులపాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

## నేటి నుంచి ప్రైవేటు కాలేజీలు బంద్

**బకాయిల విడుదలపై అధికారులతో చర్చలు విఫలం**



**హైదరాబాద్, నవంబరు 2 :** రాష్ట్రంలోని ఉన్నత విద్యాసంస్థలు సోమవారం నుంచి సమ్మె బాట పట్టనున్నాయి. డిగ్రీ, ఇంజనీరింగ్, ఫార్మసీ సహా అన్ని వృత్తి విద్య కాలేజీలు సమ్మెలో పాల్గొననున్నాయి. యాజమాన్యాల సమ్మెతో రాష్ట్రవ్యాప్తంగా 1,840 కాలేజీలు బంద్ కానున్నాయి. ఫలితంగా దాదాపు 35లక్షలకు పైగా విద్యార్థులపై సమ్మె ప్రభావం పడనుంది. గత నాలుగేళ్లుగా పేరుకుపోయిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని ప్రైవేటు కాలేజీల యాజమాన్యాల సంఘాల సమాఖ్య (ఫాతీ) గత రెండు నెలలుగా ప్రభుత్వాన్ని కోరుతోంది. పలు విడతలుగా చర్చలు కూడా జరిగాయి. ఈ నేపథ్యంలో దీపావళిలోగా రూ.1,200 కోట్లు విడుదల చేస్తామని గతంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. అయితే ఇందులో రూ.300 కోట్లు మాత్రమే విడుదల చేశారు. మిగతా రూ.900 కోట్లు వెంటనే విడుదల చేయాలని పలుమార్లు కోరినా ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన లేకపోవడంతో ప్రభుత్వానికి ఫాతీ సమ్మె నోటీసు ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఆదివారం ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు ఫాతీ ప్రతినిధులతో మాట్లాడారు. రూ.150 కోట్లు విడుదల చేస్తామని, సమ్మె విరమించాలని విజ్ఞప్తి చేశారు. దీనికి యాజమాన్యాలు అంగీకరించలేదు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు బకాయిలు విడుదల చేయకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో సమ్మె చేస్తున్నామని ఫాతీ అధ్యక్షుడు నిమ్మగడ్డ రమేషబాబు తెలిపారు. సోమవారం నుంచి అన్ని ఉన్నత విద్యాసంస్థలు సమ్మెలో పాల్గొంటాయన్నారు. ప్రభుత్వంతో చర్చలు కొనసాగినా.. బకాయిలు ఇవ్వనంతవరకు సమ్మె కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. సమ్మె నేపథ్యంలో విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా పరీక్షలు వాయిదా వేయాలని అన్ని వర్సిటీలను కోరినట్టు తెలిపారు. సమ్మె నేపథ్యంలో పరీక్షలు వాయిదా పడ్డాయి. జేఎన్‌టీయూ పరిధిలోని ప్రథమ సంవత్సరం రెండో సెమిస్టర్ వార్షిక పరీక్షలను వాయిదా వేశారు. అలాగే బీఈడీ, డీఈడీ పరీక్షలను వాయిదా వేస్తున్నట్టు అధికారులు ప్రకటించారు. అనేక కాలేజీల్లో జరుగుతున్న ఇంజనీరింగ్ ఇంటర్నల్ పరీక్షలనూ వాయిదా వేశారు. రాష్ట్రవ్యాప్తంగా 800 ప్రైవేటు డిగ్రీ కాలేజీలు ఉండగా.. 300 ఎంబీఏ-ఎంసీఏ, 215 బీఈడీ, 175 ఇంజనీరింగ్, 123 ఫార్మసీ, 100 పాలిటెక్నిక్, 70 డైట్, 27 ఆర్కిటెక్చర్, 30 న్యాయ కళాశాలలున్నాయి.

# ఏమాత్రం అలసత్వం వద్దు

**పెయిడ్ సర్వేలతో బీఆర్ఎస్ తప్పుడు ప్రచారాలు.. వాటిని తిప్పికొట్టండి**

**కాంగ్రెస్ సర్కారు చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని క్షేత్రస్థాయికి వెళ్లి వివరించండి**

**'జూబ్లీహిల్స్' గెలుపు ప్రభుత్వానికి, మంత్రులకూ కీలకమే**

**మీ సొంత ఎన్నికలా తీసుకుని పనిచేయండి.. పోల్ మేనేజ్‌మెంట్‌పై దృష్టిపెట్టండి**

**ఎవరి పనితీరు ఎలా ఉందన్నది అధిష్ఠానం చూస్తోంది.. మంత్రులతో సీఎం**

**వంద ఓట్లకొక బూత్ స్థాయి ఏజెంట్‌ను పెట్టాలని రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం**

**ప్రచార సమన్వయం కోసం కో-ఆర్డినేషన్ కమిటీ ఏర్పాటు**



**హైదరాబాద్, నవంబరు 2 :** జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు సునాయాసమేనని, అయినా సరే ఏమాత్రం అలసత్వం చూపవద్దని మంత్రులకు సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. బీఆర్ఎస్ తప్పుడు ప్రచారాలు, పెయిడ్ సర్వేలను ప్రజల్లోకి తీసుకెళుతోందని, వాటిని సమర్థవంతంగా తిప్పి కొట్టాలని దిశానిర్దేశం చేశారు. వాస్తవాలను ప్రజలకు వివరించాలని.. కాంగ్రెస్ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఓటరు దృష్టికీ తీసుకెళ్లాలని చెప్పారు. ఈ ఎన్నిక ప్రభుత్వానికి, మంత్రులకు కూడా కీలకమేనని స్పష్టం చేశారు. అందరూ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని పనిచేయాలని, మంచి మెజారిటీతో పార్టీ అభ్యర్థిని గెలిపించుకోవాలని సూచించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు సంబంధించి ఒక్కో డివిజన్‌కు ఇద్దరు మంత్రుల చొప్పున బాధ్యతలు కేటాయించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి తన నివాసంలో మంత్రులతో విందు సమావేశం నిర్వహించారు. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, ప్రభుత్వ సలహాదారులు కూడా ఇందులో పాల్గొన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో డివిజన్ల వారీగా ప్రచారం, ఇతర కార్యక్రమాలపై సీఎం సమీక్ష జరిపారు. ఆయా డివిజన్లలో ఇన్‌చార్జి మంత్రుల పనితీరు బాగానే ఉందని, పార్టీ విజయం కూడా సునాయాసమేనని సీఎం రేవంత్ పేర్కొన్నారు.

ఉప ఎన్నిక ప్రభుత్వానికి చాలా కీలకమని, మంత్రులంతా సొంత ఎన్నికలా తీసుకుని పనిచేయాలని సూచించారు. ఎవరి పనితీరు ఎలా ఉందన్నది అధిష్ఠానం ఎప్పటికప్పుడు పరిశీలిస్తోందని చెప్పారు. ఉప ఎన్నికలో గెలిచేందుకు బీఆర్ఎస్ తప్పుడు ప్రచారాలు చేస్తోందని, పెయిడ్ సర్వేలను వినియోగించుకుంటోందని రేవంత్ పేర్కొన్నారు. సోషల్ మీడియాను విస్తృతంగా వినియోగించుకుని తప్పుడు సమాచారాన్ని జనంలోకి తీసుకెళుతోందని గుర్తుచేశారు. బీఆర్ఎస్ చేస్తున్న ఆ తప్పుడు ప్రచారాలను, తప్పుడు సర్వేలను మంత్రులు బలంగా తిప్పి కొట్టాలని సూచించారు. పోల్ మేనేజ్‌మెంట్‌పై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని.. ప్రతి వంద మంది ఓటర్లకు ఒక బూత్ స్థాయి ఏజెంట్‌ను పెట్టి, పర్యవేక్షించాలని సూచించారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని చెప్పారు. ఇక ఈ ఉప ఎన్నికను సీరియస్‌గా తీసుకుని పనిచేయాలని మంత్రులకు మీనాక్షి నటరాజన్, మహేశ్‌గౌడ్ సూచించారు. ఇక కొత్తమంత్రి అజారుద్దీన్‌కు, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డికి మంత్రులు అభినందనలు తెలిపారు.

**ప్రచారంపై సమన్వయ కమిటీ ఏర్పాటు**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ప్రచారాన్ని సమన్వయం చేసుకునేందుకు కో-ఆర్డినేషన్ కమిటీని నియమించారు. జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి చైర్మన్‌గా, మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్ కో-చైర్మన్‌గా, మరో 14 మంది సభ్యులతో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఈ కమిటీని ఏర్పాటు చేశారు.

## నేటి నుంచి హెలికాప్టర్ సర్వే

**ఎస్ఎల్‌బీసీ సొరంగం పనుల పునరుద్ధరణ కోసం నిర్వహణ**

**స్వయంగా పర్యవేక్షించనున్న సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్**

**నేడు మన్నెవారిపల్లికి రేవంత్**

**హైదరాబాద్, నవంబరు 2 :** శ్రీశైలం ఎడమ గట్టు కాల్వ (ఎస్ఎల్‌బీసీ) సొరంగం తవ్వకం పనుల పునరుద్ధరణలో భాగంగా సోమవారం హెలికాప్టర్‌తో 'మాగ్నెటిక్ జియోఫిజికల్ సర్వే'ను ప్రారంభించనున్నారు. సీఎం రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి సోమవారం నాగర్‌కర్నూలు జిల్లా మన్నెవారిపల్లి చేరుకుని సర్వేను పర్యవేక్షించనున్నారు. సర్వే జరిపే హెలికాప్టర్‌కు సమాంతరంగా మరో హెలికాప్టర్‌లో సీఎం, మంత్రి ప్రయాణిస్తూ పరిశీలిస్తారు. నేషనల్ జియోఫిజికల్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్‌జీఆర్ఐ) శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో ఈ సర్వే నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సర్వే హెలికాప్టర్ దాదాపు 200 కి.మీ. మేర ప్రయాణిస్తూ సొరంగం తవ్వాల్సిన ప్రాంతంలో భూగర్భంలో 800-1000 మీటర్ల లోతు వరకు ఎలాంటి పరిస్థితులు ఉన్నాయో జల్లెడ పడుతుంది. గత ఫిబ్రవరిలో సొరంగం కుప్పకూలిన ఘటనలో కార్మికులు మృత్యువాత పడడంతో పాటు టన్నెల్ బోరింగ్ మెషీన్ (టీబీఎం) ముక్కలు చెక్కలైంది. దీంతో నిపుణుల కమిటీ సిఫారసుల మేరకు అత్యంత సురక్షిత పద్ధతిలో సొరంగం తవ్వకాలను పునరుద్ధరించడానికి ఈ సర్వే నిర్వహించాలని ప్ర భుత్వం నిర్ణయించింది. ప్రాజెక్టులో భాగంగా రెండు సొరంగాల్లో రెండోదాని తవ్వకాలు పూర్తయ్యాయి. ఒకటో సొరంగాన్ని మొత్తం 43.93 కి.మీ. తవ్వాల్సి ఉండగా.. ఇన్‌లెట్ వైపు నుంచి 13.94 కి.మీ., అవుట్‌లెట్ వైపు నుంచి 20.4 కి.మీ. తవ్వకం ఇప్పటికే పూర్తయింది. మధ్యలో 9.8 కి.మీ. తవ్వాల్సి ఉంది.

**సీఎం పర్యటనపై ఆసక్తి**

నల్లగొండ జిల్లాకు సాగు నీరందించే ఎస్ఎల్‌బీసీ పనుల పునరుద్ధరణకు కీలక సర్వే జరగనున్న నేపథ్యంలో నాగర్‌కర్నూలు జిల్లా నల్లమలలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉన్నప్పటికీ సోమవారం ఆయన ఇక్కడకు రానుండడం ఆసక్తికరంగా మారింది. హైదరాబాద్ నుంచి బయలుదేరి మధ్యాహ్నం 12:30 గంటలకు ఆయన మన్నెవారిపల్లికి చేరుకోనున్నారు. అక్కడ పార్టీ అచ్చంపేట నాయకులతో సమావేశమైన తర్వాత సర్వే పరిశీలనలో పాల్గొంటారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడతారు.

## వేధింపులపై గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థినుల ఆందోళన

**షాద్‌నగర్‌లో ఆరు గంటల పాటు ధర్నా**

**ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్**

**పోలీసులు, విద్యార్థినుల మధ్య తోపులాట**

**షాద్‌నగర్/షాద్‌నగర్ రూరల్, నవంబరు 2 :** నిత్యం తమను వేధిస్తున్న ప్రిన్సిపాల్ శైలజను సస్పెండ్ చేయాలంటూ నాగర్‌కర్నూల్ గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థినులు కదం తొక్కారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ ప్రధాన కూడలిలో 400 మందికి పైగా విద్యార్థినులు సుమారు 6 గంటల పాటు ధర్నా చేశారు. కలెక్టర్ వచ్చి ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉన్నతాధికారులతో మాట్లాడామని, ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని షాద్‌నగర్ సీఐ విజయకుమార్ తెలిపినా వినలేదు. ఈ క్రమంలో పోలీసులు, విద్యార్థినుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. ఓ విద్యార్థిని సొమ్మసిల్లి పడిపోయింది. చివరి కి పోలీసులు విద్యార్థినులను ఒప్పించి పోలీస్‌స్టేషన్‌కు తరలించి.. స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు. సాంఘిక సంక్షేమ శాఖ జోనల్ అధికారి నిర్మల కళాశాలకు వచ్చి విచారణ చేపట్టారు. ప్రిన్సిపాల్ వేధింపుల గురించి విద్యార్థినులు ఏకరువు పెట్టారు. గుడ్‌మార్నింగ్ చెప్పలేదని ఇంటర్నల్ పరీక్షలకు రానివ్వలేదన్నారు. ప్రిన్సిపాల్‌ను కూడా విచారించి సర్కారుకు నివేదిక అందజేస్తామని, వారంలో చర్యలు తీసుకుంటామని నిర్మల చెప్పారు.

**విద్యార్థుల నుంచే ఫీజుల వసూలు**

నాగర్‌కర్నూల్‌కు చెందిన సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల డిగ్రీ కళాశాలను షాద్‌నగర్ శివారులోని ఖాళీగా ఉన్న నూర్ ఇంజనీరింగ్ కళాశాల భవనాల్లో నిర్వహిస్తున్నారు. ఈ కళాశాల ప్రిన్సిపాల్‌గా శైలజ పనిచేస్తున్నారు. ఆమె సూర్యాపేట గురుకుల డిగ్రీ కళాశాలలో పనిచేస్తుండగా పలు అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలతో ఈ కళాశాలకు బదిలీ చేశారు. ఆమె ఇక్కడా విద్యార్థినుల పట్ల నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని విద్యార్థినులు ఆరోపించారు. తమ పరీక్ష ఫీజు ప్రభుత్వమే చెల్లిస్తున్నా ఫీజు చెల్లించాలంటూ 490 మంది విద్యార్థినుల నుంచి రూ.2,300 చొప్పున వసూలు చే శారని తెలిపారు. విద్యార్థినుల కార్పస్‌ఫండ్ కోసం ప్రతి నెలా రూ.50 వేలు జమ చేస్తుంటే ఆ డబ్బులను తమకు ఇవ్వడం లేదన్నారు. ఎవరైనా ఫైనలియర్ విద్యార్థిని వివాహం చేసుకుంటే ఆమె తల్లిదండ్రులు ఎంత కట్నం ఇస్తున్నారో.. అందులో సగం ఎంతైతే అంత తనకివ్వాలని వేధిస్తున్నారని తెలిపారు. కళాశాలకు 20 కేజీల మటన్ సరఫరా అవుతుంటే.. అందులో సగం ప్రిన్సిపాల్ నొక్కేస్తున్నారని చెప్పారు. ప్రిన్సిపాల్ శైలజకు ఇతర అధ్యాపకులు కూడా అండగా నిలుస్తున్నారని ఆరోపించారు. కాగా, విద్యార్థినుల ధర్నాతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. సుమారు 4 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి.

# భార్యపై అనుమానంతో దారుణం

**ఆమెతో పాటు కూతురు, వదినను చంపి తాను ఆత్మహత్య**

**నిద్రిస్తున్న వారిపై కత్తితో ఘాతుకం**

**తప్పించుకున్న పెద్ద కూతురు**

**వికారాబాద్ జిల్లా కులకచర్లలో ఘటన**





**కులకచర్ల, నవంబరు 2 :** వికారాబాద్ జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. ఓ వ్యక్తి భార్యపై అనుమానంతో ఆమెను, చిన్న కుమార్తెను, వదినను నరికిచంపాడు. పెద్ద కుమార్తె గాయాలతో తప్పించుకుని బయటపడింది. ఆపై ఆ వ్యక్తి ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కులకచర్లకు చెందిన వేపూరి యాదయ్య (38)కు పాలమూరు జిల్లా హన్వాడ మండలం పగిడ్యాల్‌కు చెందిన అలవేలు(34)తో 15 ఏళ్ల క్రితం పెళ్లి జరిగింది. వీరికి కుమార్తెలు అపర్ణ (13), శ్రావణి (10) ఉన్నారు. దంపతులిద్దరూ కూలి పనులకు వెళ్తూ జీవనం సాగిస్తున్నారు. యాదయ్య అలవేలుపై అనుమానం పెంచుకున్నాడు. దీంతో తరచూ గొడవ పడుతుండేవారు. పెద్దల సమక్షంలో పంచాయి తీలు జరిగాయి. పోలీసు స్టేషన్ వరకు కూడా వెళ్లారు. శనివారం సాయంత్రం కూడా స్థానిక ఓ ప్రజాప్రతినిధి వద్ద పంచాయితీ జరగగా.. గొడవలు పడకుండా ఉండాలని ఆ ప్రజాప్రతినిధి నచ్చజెప్పి పంపించాడు. అయితే అనుమానంతో భార్యపైన, తమ మధ్య గొడవలో అడ్డు వస్తోందని వదిన (అలవేలు అక్క) హన్మమ్మ (40)పై యాదయ్య పగ పెంచుకున్నాడు. హన్మమ్మది కోస్గి మండలం బలభద్రయపల్లి గ్రామం. శనివారమే పంచాయితీ కోసం వచ్చింది. పంచాయితీలో హన్మమ్మ మాట్లాడిన తీరుపై యాదయ్య కోపంతో రగిలిపోయాడని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో రాత్రి అందరూ కలిసి భోజనం చేసి పడుకున్నారు. ఆదివారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో యాదయ్య నిద్రిస్తున్న హన్మమ్మపై తాటి ముంజెలు తీసే కత్తితో దాడి చేశాడు. దీంతో ఉలిక్కిపడి లేచిన భార్య, పిల్లలు అతడిని అడ్డుకునేందుకు విఫలయత్నం చేశారు. తర్వాత యాదయ్య భార్యపైన, ఆపై చిన్నకూతురు శ్రావణిపైనా కత్తితో దాడి చేసి చంపాడు. పెద్ద కూతురు అపర్ణనూ చంపేందుకు ప్రయత్నించగా.. ఆమె గాయాలతో తప్పించుకుంది. గ్రామంలో ప్రభు అనే వ్యక్తి ఇంటికెళ్లి జరిగిన విషయం చెప్పింది. ప్రభు, అతని సోదరుడు పెంటయ్యను నిద్రలేపి యాదయ్య ఇంటికి వచ్చి చూడగా అప్పటికే హన్మమ్మ, అలవేలు, శ్రావణి రక్తపుమడుగులో నిర్జీవంగా పడి ఉన్నారు. యాదయ్య ఉరేసుకుని కనిపించాడు. యాదయ్య భార్యపై అనుమానంతో పాటు వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడని, దాన్ని నిలదీసినందుకే ఈ ఘాతుకానికి పాల్పడ్డాడని స్థానికులు చెబుతున్నారు. అలవేలు అన్న శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

**పాపం.. అపర్ణ**

తల్లి, తండ్రి, పెద్దమ్మ, చెల్లిని కోల్పోయిన అపర్ణ అనాథగా మారింది. గాయపడిన ఆమె పరిగి ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. అపర్ణ భవిష్యత్తు ఏమిటని, తల్లిదండ్రులు లేని లోటును ఎవరు తీరుస్తారని పలువురు కంటతడిపెట్టారు.

జనరల్
GENERAL

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక

సోమవారం 3 నవంబర్ 2025






# రాజన్న నువ్వు సల్లగుండాలే!!





## నీవల్లే ఇల్లు కట్టుకున్న రాజన్న చేయి పట్టుకుని ఇంటికి తీసుకుపోయిన రాములమ్మ రాములమ్మ కళ్ళల్లో ఆనందం మాటల్లో ఆత్మీయత కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి జనం నీరాజనం...!!

చౌటుప్పల్, రోమింగ్ న్యూస్: రాజన్న నువ్వు చల్లగుండాలి... నీ వల్లనే ఇల్లు కట్టుకున్న అంటూ చౌటుప్పల్ మండలంలో రాములమ్మ అనే మహిళ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పై ఆత్మీయతతో కూడిన ఆనందం వ్యక్తం చేసింది. చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం గ్రామానికి వెళ్లిన మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డికి అనుకోని అతిది ఎదురొచ్చి మరి తన ఇంటికి తీసుకెళ్ళింది..మొదటి విడత జాబితాలో ఇందిరమ్మ ఇల్లు మంజూరైన బుర్ర రాములమ్మ తనకున్న స్థలంలో ఇంటిని నిర్మించుకుంటుంది..ఇప్పటికే మూడు విడతలుగా రూ. 4,00, 000 రూపాయలు రాములమ్మకు ప్రభుత్వం నుండి అందాయి..ఇంటినిర్మాణ పనులు కొన సాగుతున్నాయి..తాను మీ వల్లే ఇల్లు కట్టుకుంటున్నానని నా ఇంటికి మీరు రావాలని ఆనందంతో ఆత్మీయతతో అభిమానంతో పిలిచింది

### రాములమ్మ పిలిచిన వెంటనే ఆమె ఇంటికి వెళ్ళిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

రాములమ్మ పిలవగానే క్షణం ఆలస్యం చేయకుండా నిర్మించుకుంటున్న ఇందిరమ్మ ఇంటికి వెళ్లి ఇంటిని పరిశీలించి, ఎన్ని బిల్లులు వచ్చాయి ఎంత ఖర్చయిందని వివరాలు అడిగి తెలుసుకున్నారు... మీరు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించకపోతే నేను సొంత ఇల్లు కట్టుకోలేక పోయేదానినని మీ వల్లే ఈరోజు ఇల్లు కట్టుకుంటున్నారని మురిసిపోయింది.. రాములమ్మ మురిసిపోతూ చెబుతున్న మాటలు విన్న రాజ్ గోపాల్ రెడ్డి మీ ఇంటి నిర్మాణం పూర్తవడానికి రెండు లక్షలు పంపిస్తానని మాట ఇచ్చాడు.. అక్కడే ఉన్న స్థానిక నాయకులను రాములమ్మ ఇల్లు పూర్తయ్యే వరకు చూడాలని అదేశించారు...

# మెర్సీ మార్గరెట్ యుద్ధకాలపు శోకగీతం పుస్తకావిష్కరణ



రవీంద్ర భారతి, రోమింగ్ న్యూస్: హైదరాబాద్ రవీంద్రభారతిలో రచయిత మెర్సీ మార్గరెట్ రచించిన యుద్ధకాలపు శోకగీతం (దీర్ఘ కవిత) పుస్తకావిష్కరణ సభ జరిగింది. కవి యాకూబ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన కవి, విమర్శకుడు సీనియర్ జర్నలిస్ట్ సతీష్ చందర్ పుస్తకాన్నిఆవిష్కరించి తొలి పత్రిని రచయిత్రి తండ్రికి అందజేశారు. ఈ సందర్భంగా సతీష్ చందర్ మాట్లాడుతూ కవులకు వేరే పేర్లు ఉన్నట్టే గన్నులకి యుద్ధాలకు పేర్లు ఉంటాయి అని ఈ కవయిత్రి గుర్తించిందని, యుద్ధం అనేక రూపాలుగా మారుతూ వస్తుందని, రాజ్యాల కోసం మొదలై శాంతి కోసం కూడా యుద్ధాలు చేసే పరిస్తితికి పాలకులు చేరుకున్నారని అన్నారు. మెర్సీ రాసిన ఈ కవిత్వం ఆ యుద్ధంలో నష్ట పోతున్న అమ్మల, పిల్లల గాథ, అమ్మల రోదన పిల్లల మాంసాల మధ్య తిరుగుతూ యుద్ధం వద్దు అంటూ కవిత్వంతో శోక గీతం పాడుతూ రోదిస్తుంది,. మనల్ని తనతో శోక గీతానికి కోరస్ పాడటానికి పిలిచిందని అన్నారు. ఆచార్య సి.కాశీం మాట్లాడుతూ మెర్సీ ముందు మూడు కవిత్వ సంపుటాలు వేసిందని, ఆ కవితల్లో ఏ కవిత తీసుకన్నా యుద్ధమే కనిపిస్తుందని, ఈ కవయిత్రి మాటలు మనుషులకు ఎంత ప్రాణపదమో తెలుసనీ, మాటలు మాయమవుతున్న మనుషుల నుంచి యుద్ధ బీభత్సం గురించి మాట్లాడండి అని వేడుకుంటుంది. సున్నితత్వాన్ని కూడా యుద్ధ తలపోతల ప్రతిఘటనకి వాడుకుందని, కవిత్వం ఎందుకు రాయాలో ఎవరి పక్షాన నిలబడాలో తెలిసిన కవయిత్రి మెర్సీ అని కొనియాడారు. ఎ.కె. ప్రభాకర్ ప్రభాకర్ యుద్ధకాలంలో మనుషుల స్థితిని చూసి నిజమైన బాధ్యత కలిగిన కవి ఎవరు ఊరుకోరని, దుఃఖం కవిత్వం చేయగలిగిన ఈ కవయిత్రి, కవిత్వం రాసేప్పుడు ఒకలా నిజ జీవితంలో ఒకలా ఉందదని, తల్లుల రోదనలను, పిల్లల మాంసపు ముద్దలను గట్టిగా హత్తుకుని రోదిస్తుందని అన్నారు. మానవ సంవేదనలు కవిత్వం చేయటంలో ఎప్పుడూ వెనక్కి వెళ్ళదని మళ్ళోసారి మనకు భరోసాగా నిలిచిందని అన్నారు. మెర్సీ మార్గరెట్ మాట్లాడుతూ యుద్ధకాలపు శోకగీతం ఆవిష్కరణ కోసం ప్రేమగా వచ్చిన ప్రతిఒక్కరికి, పుస్తకాన్ని ప్రచురించిన 'ఎన్నెలపిట్ట పబ్లికేషన్స్', శేషుకి కృతజ్ఞతలు తెలిపింది. ఈ కార్యక్రంలో డా. ఎస్. చంద్రయ్య, సారంగి వ్యవస్థాపకుడు ఖాజా ఆఫ్రిది, కవులు, రచయితలు తదితరులు పాల్గొన్నారు.

# 317 బాధితులను తక్షణమే ఆదుకోవాలి

### డీఎస్సీడివో పోస్టులకు అనుమతి ఇవ్వాలి తెలపాలి

### జాక్ట్ పోస్టులను జూనియర్ అసిస్టెంట్లుగా కన్వర్ట్ చేయాలి

### టీజీ ఎస్సీడిడి ఎం ఎస్ ఏ డిమాండ్





నల్గొండ, నవంబర్(రోమింగ్ న్యూస్): షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖలో 317 బాధిత ఉద్యోగులకు తక్షణమే న్యాయం చేయాలని ఎస్సీడిడి మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఉప్పు సత్యనారాయణ డిమాండ్ చేశారు. సుదూర ప్రాంతంలో 317 జీవో బాధితులు పనిచేస్తున్నారని ఆయన వాపోయారు. తెలంగాణ షెడ్యూల్డ్ కులాల ఎస్ సి డి డి స్టాఫ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నల్లగొండలోని టీఎన్జీవో కేంద్ర కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా టీఎన్జీవో సెక్రెటరీ జె.శేఖర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉప్పు సత్యనారాయణ మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న 12 డిఎస్డివో పోస్టులను, సూపరెంటెండెంట్ పోస్టులను తక్షణమే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సోషల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ లో ఖాళీలను తక్షణమే నింపాలని ఆయన డిమాండ్ చేశారు. సూపరెంటెండెంట్ పోస్టులకు గెజిటెడ్ హోదా కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. టిజి ఎస్ సి డిడి ఎం ఎస్ ఏ రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.జైపాల్ ఆధ్వర్యంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో ఎన్ టీఎన్జీవో జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ రాజు, హెచ్ డబ్ల్యు ఓస్ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, సలహాదారులు జె.సజన్ కుమార్, ఉమెన్స్ వింగ్ స్టేట్ ప్రెసిడెంట్ శ్రీమతి కె.లత, బి.గోపాలకృష్ణ, జి.సుధీర్, రహీముద్దీన్, కోశాధికారి కే.జీవన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఇటికల వెంకటేష్, కె.సంపత్ కుమార్, శశికళ, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.సంజీవ, ఫైనాన్స్ కమిటీ కన్వీనర్ శ్రీనివాస్ వెక్కిరాల, కార్యవర్గ సభ్యులు ఎన్.చంద్రశేఖర్, ఆర్విఆర్ ప్రసాద్, రవి వర్మ విజయవర్ధన్, ఎ.రమేష్, హర్షవర్ధన్, అస్లాం తదితరులు పాల్గొన్నారు.

# అమరుల త్యాగాలు వృధా కావు




యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదాద్రి భువనగిరి జిల్లా,యాదగిరి గుట్ట మండలం,భాహుపేట గ్రామంలో సిపిఐ (ఎంఎల్) ఎన్ డిఆర్ ఆధ్వర్యంలో అమరుల వర్ధంతి జరిగింది, పార్టీ యాదగిరిగుట్ట సబ్ డివిజన్ కార్యదర్శి వస్పరి బాల్లమల్లేష్ అధ్యక్షత వహించి, జెండావిష్కరించగా అమరులకు రెండు నిముషాలు మౌనం పాటించి,నివాళులు అర్పించారు. అనంతరం IFTU రాష్ట్ర నాయకులు పంగ అంజయ్య మాట్లాడుతూ నిత్యం ప్రజల కోసం,వారి సమస్యల పరిష్కారం కోసం పనిచేసిన విప్లవ కారుల త్యాగాలు వృధాకావని,చిరకాలం ప్రజల గుండెల్లో నిలిచిఉంటాయని తెలిపారు.దేశ,రాష్ట్ర వ్యాప్తంగా అనేకమంది అమరుల అయ్యారు. వారి అడుగుజాడల్లో నేడు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో POW రాష్ట్ర కన్వీనర్ పంగ వరలక్ష్మి, PDSU రాష్ట్ర అధ్యక్షులు పంగ రవి, AIKMS జిల్లా అధ్యక్షులు జన్నె మల్లేష్, వెంకటేష్, p సునీల్ మహేష్, b నర్సింహులు, p ఉపేందర్, k మల్లేష్, k అయిలయ్య, k సాగర్, p రవి, k బాలరాజు,తదితరులు పాల్గొన్నారు.

# నా రాతలికి.. గీతలకి ప్రేరణ మీరే

నేను రాసిన కవితలు.. ఎన్ని చోరీకి గురయ్యాయో! ఎంతమంది వాటిని కాపీ కొట్టారో.! ఎన్ని రకాలుగా మార్చబడ్డాయో, ముక్కలు చెక్కలుగా కత్తిరించబడ్డాయో తెలియదు. కానీ, అవి ఆ రోజుల్లో ఓ సంచలనం. అది మిత్రుల మాట. సినీ హీరో రాజశేఖర్ కు పంపిన రచనలు తిరిగొచ్చాయి. ఫ్రమ్ అడ్రస్ హై స్కూల్ ది రాయడంతో తెలుగు పండితుడు శౌరిరాజన్ చేతిలో పడ్డాయి. ఆయన క్లాస్ రూమ్ లో 'రమేష్' ఎవరని అడిగి కవిగా తొలి పరిచయం చేశారు. కొన్ని లైన్లు మాస్టారు, మరికొన్ని లైన్లు ఇద్దరు మిత్రులు మొత్తం చదవలేక మాస్టర్ కి ఇచ్చి వారి సీట్లలో కూర్చున్నారు. ఆ సమయంలో 'రాసేది అందరికీ తెలిసింది, అడ్డంగా దొరికిన' అని ఫీల్ అయ్యాను.



**ప్రేమ కవితలు, జానపద గేయాలు, స్నేహ బంధవ్యాలపై రాసినవి మరింత గుర్తింపుని తెచ్చి పెట్టాయి. 'దోస్త్ దాచపడ్డ రహస్యాలెన్నీ, గాయపడ్డ గుండెలెన్ని..', 'కాలాన్ని మార్చిన కన్నీళ్లే.. నీ అడుగుల జాడలవుతున్నయ్..' ఇలా పదుల సంఖ్యలో రాసినవి ఉన్నాయి. కొన్ని గుర్తుకు రావటం లేదు. కొందరి కోసం రాసినవి ఎంతమందికి చేరినయో కదా. ఏదైతేనేమి స్నేహాన్ని మించిన గొప్పతనం లేదని చాటి చెప్పే కవితలవి. సెలయేరు పారినట్టు ఆ కవితలకు ఏ శక్తి ఆవహించిందో, నడక వచ్చిందేమో మరి.. సరాసరి దోస్తుల పుస్తకాల్లోకి, వాళ్ల జేబులలోకి చేరిపోయినయ్. పుట్టినరోజు, పెండ్లిరోజు, మరేదైనా సమయంలో.. నా కలాన్ని తట్టిన మిత్రులు. ఇద్దరు ముగ్గురైతే బతిమిలాడి రాయించుకున్నవి. రాసిచ్చిన గుర్తులూ. రాతిశిలకి అక్షరాలు చెక్కినట్లు ఇంకా కొందరి స్నేహితుల హృదయాల్లో చెరిగిపోని అక్షరాలుగా ఉన్నవి. వాళ్ళిప్పుడూ చెబుతుంటే.. నవ్వొస్తుంది. పాతికేండ్లుగా అవి సజీవంగా నిలిచాయంటే చందమామను అందుకున్నంత మనస్సు హాయిగా ఉంది.**

'నేస్తమా.. రావా నా కోసం'.. అంటూ ప్రారంభించబడిన ప్రేమ కవితా ఎంతమంది పోరగాండ్ల హృదయాలు దోచుకుందో. 'చిరు నవ్వుల వరాలిస్తవా..' ఎంతమంది ప్రేమికులని కలిపిందో నాకైతే తెలియదు. ఎందరి దరహాసాలపై నాట్యమాడిందో.. ఎందరిని కదిలించిందో.. ఎంత మందిని వేధించిందో.. టపాసులు పేలినట్టు పేలిపోయాయి. ' సఖి.. కాటి నుండైనా, / బూడిదె లోంచి ఐనా జీవం పోసుకుంట, / నీకోసం'.. అనే వాక్యాలు ఎటువంటి ప్రకంపనలు సృష్టించినవో నేను చెప్పేది కాదు, అది మిత్రులకీ తెలుసు. కారు చీకట్లో గుడ్డి దీపాలను వెలిగించినట్లు అవి ఆనాడు వెలిగిపోయాయి. కొద్ది మంది మిత్రులు కావాలని రాయించుకున్నవి కవితలు కొన్నైతే.. సహజంగా రాసివి మరిన్నీ.

**'వగల్లాడి వయ్యారం' అంటూ రాసిన జానపద గేయం ఎన్ని పసి హృదయాలకు వగలు చూపించిందో.. జోరు మీద ఉన్న కుర్రకారు కూని రాగాలు తీశారుగా.., 'ఓ పాల గోరింక మోదుగు పువ్వుపై మోజు పడ్డావా..' మిత్రులారా గుర్తుందా! ప్రేయసిని గోరింకతో పోల్చుతూ రాసింది. ఇక్కడితో ఆగిపోలేదు. పాలకుర్తి జానపదుల జాతరపై రాసిన పాట, నాకైతే జాతరొచ్చిన ప్రతేడాది గుర్తొస్తుంది. 'జాతరమ్మ.. జాతర, పాలకుర్తి జాతర.. సోమన్న జాతర, ఇంటి ఇలవేల్పు జాతర..' ఆనాడు ఎందరిని ఆకట్టుకుందో ఇప్పటికీ గుర్తు ఉంటే చెప్పండి. కొంతమందికి పేరడీ సాంగ్స్ రాసిచ్చినట్టు గుర్తుంది. స్నేహం, ప్రేమ అంశాలపై ప్రారంభమై అదే సమయంలో కొన్ని అభ్యుదయ కవితలు జీవం పోసుకున్నాయి. సామాజిక స్పృహ గలిగిన పాటలు రాయడం నన్ను ఇంకా విస్మయానికి గురి చేస్తుంది.**

మన బడి పోరగాండ్ల సమ్మేళనం ఏర్పాటు సమయంలో.. భాషారత్ గార్డెన్ లో ఆత్మీయ కలయిక సందర్భంగా కలిసిన మిత్రులు ఆనాటి నా రాతలను, గీతలను యాది చేశారు. షేకండిచ్చి ఆలింగనం చేసుకొని మళ్లీ ఆదరించారు. నేను మర్చిపోయినవి గుర్తు చేయడం ఎంతో ముచ్చటగా అనిపించింది. ఆనాటి బాల కవిగా, ఒక చిత్రకారుడుగా నాకు మీ నుంచి లభించిన ప్రోత్సాహం నా ప్రస్థానానికి జవసత్వమైంది.

**అంతేకాదు, వాళ్ల కోసం వేసిచ్చిన బొమ్మలు వాళ్ళ ఇండ్లల్లో ఎంతకాలం గోడలకు ఉన్నాయో గుర్తు చేసుకున్నారు. ప్రియా పిక్చర్ ప్యాలెస్ కి నేను రాసిన బ్యానర్లను కట్టి కుషీ అయిన స్నేహితులు ముఖ్య విషయం చెప్పుకొచ్చారు. సినీ నటుల బొమ్మలు బ్యానర్ పై వేయడం నాతోటే ప్రారంభమైంది. అప్పటివరకూ సాధారణంగా హీరోల పేర్లు రాసి శుభాకాంక్షలు తెలిపేవి. చిరంజీవి, పవన్ కళ్యాణ్, మహేష్ బాబు, ఇతర హీరోల ఫోటోలతో కూడిన బ్యానర్లు వారి అభిమానులు చిత్రకళకు పదును పెట్టించారు. అప్పుడు కొత్తగా నిర్మాణమైన మా ఇంటి గోడలకు బ్యానర్లు కట్టి వర్క్ చేసేవాడ్ని. వాటిని తీసుకెళ్లి టాకీస్ ముందు కట్టి ఫస్ట్ షో సినిమాలు చూసి ఎంత ఎంజాయ్ చేశారో వారి మాటల్లో అర్థమయింది.**

టెన్త్ క్లాస్ పూర్తయిన రెండేండ్ల కాలం వరకూ కూడా నాతో పలు రకాల బ్యానర్లు, పెండ్లిళ్లకు సంబంధించిన బ్యానర్లు, థర్మకోల్ షీట్స్ తో రాసిన బోర్డులు, ప్రత్యేకించి కొందరి క్లాస్మేట్స్ పెండ్లిళ్లకు రాసినవి కూడా ఒక్కొక్కటి చెబుతుంటే ఆశ్చర్యమేసింది. నన్నింకా గుర్తుంచుకున్నందుకు మనస్సు ఉల్లాసంతో ఉప్పొంగినట్లుగా ఉంది. మీ పలకరింపు, మీ ఆత్మీయ స్పర్శ నన్ను ఉత్తేజ పరిచింది. ఆనాడు బుడిబుడిగా నేను వేసిన సాహిత్యపు తొలి అడుగులవి. నా రాతలికి.. గీతలకి ప్రేరణ మీరే. అందుకే కాబోలు 'ఆనాటి బడి పోరగాండ్ల జ్ఞాపకాలు' కు అడుగు పడింది.

- మామిండ్ల రమేష్ రాజా

సెల్ : 78932 30218

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం 3 నవంబర్ 2025



# యాదగిరిగుట్టలో 'కార్తీక' కోలాహలం

**కార్తీక దీపారాధన, వ్రతాలు జరిపించుకుని మొక్కులు తీర్చుకున్న భక్తులు**

**నారసింహుడి ధర్మదర్శనానికి 4, స్పెషల్ దర్శనానికి గంటన్నర సమయం**

**సండే ఒక్కరోజే వ్రతాలు జరిపించుకున్న 1,372 మంది దంపతులు**



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. కార్తీకమాసానికి తోడు ఆదివారం తోడవడంతో.. రాష్ట్ర నలుమూలల నుండి ఆలయానికి భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిశాయి. రద్దీ కారణంగా నారసింహుడి ధర్మదర్శనానికి 4 గంటలు, స్పెషల్ దర్శనానికి గంటన్నరకు పైగా సమయం పట్టిందని భక్తులు తెలిపారు. భక్తులు ఎక్కువ శాతం సొంత కార్లలో రావడంతో.. భక్తుల వాహనాలతో పార్కింగ్ ప్రదేశం నిండిపోయింది. దీంతో వాహనాలను హెలీప్యాడ్, వాహన పూజల ప్రాంగణానికి డైవర్షన్ చేసి పార్కింగ్ సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు చేపట్టారు. మరోవైపు కార్తీకమాసం సందర్భంగా కార్తీక పూజలు నిర్వహించుకుని భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. సత్యనారాయణస్వామి వ్రతాలు, కార్తీక దీపాలు వెలిగించి, శివకేశవులకు రుద్రాభిషేకం, లక్షబిల్వార్చన పూజలు జరిపించుకుని తరించారు.

**ఆలయానికి 'కార్తీక' శోభ**

కార్తీక పూజలు నిర్వహించుకోవడానికి భక్తులు అధిక సంఖ్యలో రావడంతో.. యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి 'కార్తీక' శోభ సంతరించుకుంది. ప్రధానాలయ ప్రాంగణం, శివాలయం, విష్ణుపుష్కరిణి, లక్ష్మీపుష్కరిణి, పాతగుట్ట, వ్రత మండపాల్లో భక్తుల నిర్వహించుకున్న కార్తీక పూజలతో ఆధ్యాత్మిక వాతావరణం ఏర్పడింది. సత్యనారాయణస్వామి వ్రతాలు, కార్తీక దీపాలు, శివకేశవులకు రుద్రాభిషేకం, బిల్వార్చన పూజలు జరిపించుకుని భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. యాదగిరిగుట్ట ఆలయానికి అనుబంధ ఆలయమైన పర్వత వర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో శివకేశవులకు రుద్రాభిషేకం, లక్షబిల్వార్చన పూజలు నిర్వహించారు. వ్రత మండలాల్లో సత్యదేవుడికి వ్రత పూజలు జరిపించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

**ఒక్కరోజే వ్రతాలు జరిపించుకున్న 1,372 మంది జంటలు**

పవిత్ర యాదగిరి నరసింహస్వామి పుణ్యక్షేత్రంలో సత్యనారాయణస్వామి వ్రత పూజల్లో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. అన్నవరం తర్వాత యాదగిరిగుట్ట ఆలయంలోనే భక్తులు అధిక సంఖ్యలో వ్రతాలు జరిపించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. అందుకనుగుణంగానే ఆదివారం యాదగిరి క్షేత్రంలో సత్యదేవుడికి భక్తులు పెద్ద సంఖ్యలో వ్రతాలు నిర్వహించుకున్నారు. ఆదివారం ఒక్కరోజే 1,372 మంది దంపతులు వ్రత పూజలు జరిపించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్తీకమాసంలో రోజుకు ఆరు బ్యాచుల్లో వ్రతాలు నిర్వహించాల్సి ఉండగా..

భక్తుల రద్దీ అధికంగా ఉండడంతో ఏడు బ్యాచుల్లో వ్రతాలు నిర్వహించారు. మొదటి బ్యాచ్ లో 275, రెండో బ్యాచ్ లో 259, మూడో బ్యాచులో 254, నాలుగో బ్యాచ్ లో 266, ఐదో బ్యాచ్ లో 227, ఆరో బ్యాచ్ లో 53, ఏడో బ్యాచ్ లో 38 మంది దంపతులు వ్రతాలు నిర్వహించుకుని మొక్కలు చెల్లించుకున్నారు. ఏడో బ్యాచుల్లో కలిపి మొత్తం 1,372 మంది దంపతులు వ్రత పూజలు నిర్వహించుకున్నారు. కేవలం వ్రతాల నిర్వహణ ద్వారా ఆలయానికి ఆదివారం ఒక్కరోజే రూ. 13.72 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఆఫీసర్లు తెలిపారు.





# ప్రభుత్వ సహకారంతో ఉద్యోగుల సమస్యలకు పరిష్కారం

**టీజీటీఏ, టీజీఆర్ఎస్ఏ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి**




యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: ప్రభుత్వ సహకారంతో రెవెన్యూ ఉద్యోగుల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్, డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ అధ్యక్షులు లచ్చిరెడ్డి పేర్కొన్నారు. భూమి ఉన్నంత వరకు రెవెన్యూ డిపార్ట్‌మెంట్ ఉంటుందని, రెవెన్యూ ఉద్యోగులకు 2026 పదోన్నతుల సంవత్సరం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. యాదగిరిగుట్టలోని సౌభాగ్య రిసార్ట్స్ లో ఆదివారం జరిగిన తెలంగాణ తహశీల్దార్ల సంఘం(టీజీటీఏ), తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్(టీజీఆర్ఎస్ఏ) రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారం, న్యాయమైన డిమాండ్ల సాధనే టీజీటీఏ, టీజీఆర్ఎస్ఏ లక్ష్యమని తెలిపారు. జీపీవోలు వచ్చాక ప్రజలకు, రైతులకు రెవెన్యూ సేవలు పెరిగాయన్న ఆయన.. అతిత్వరలో రెవెన్యూ ఉద్యోగులకు పదోన్నతులు రానున్నట్లు చెప్పారు. త్వరలోనే 100 మందికి పైగా ఎమ్మార్వోలు డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతులు పొందబోతున్నారని తెలిపారు. ఓ వైపు రెవెన్యూ డిపార్ట్‌మెంట్ ను కాపాడుకుంటూనే.. రెవెన్యూ, ప్రభుత్వ ఉద్యోగుల, ప్రజల సంక్షేమం కోసం పాటుపడాలని సూచించారు. రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో చేసిన ప్రతి తీర్మానాన్ని అమలు చేసేల కార్యాచరణ ప్రణాళికను త్వరలో రూపొందించుకుందామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగుల జేఏసీ కోచైర్మన్ కేతావత్ రామకృష్ణ, టీజీటీఏ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రాములు, రమేష్, టీజీఆర్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బాణాల రాంరెడ్డి, వి.బిక్షం, టీజీటీఏ అసోసియేట్ అధ్యక్షులు చల్లా శ్రీనివాస్, టీజీటీఏ మహిళా విభాగం అధ్యక్షురాలు పి.రాధ, టీజీఆర్ఎస్ఏ మహిళా విభాగం అధ్యక్షురాలు సుజాత చౌహాన్, తహశీల్దార్లు గణేష్ నాయక్, దేశ్యానాయక్, 33 జిల్లాల టీజీటీఏ, టీజీఆర్ఎస్ఏ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఈ నెల 5న 'కార్తీక పౌర్ణమి'న అన్నకూటోత్సవం, ఆకాశ దీపారాధన

యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: ఈ నెల 5న పవిత్ర 'కార్తీక పౌర్ణమి' పర్వదినం సందర్భంగా యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో 'అన్నకూటోత్సవం', 'ఆకాశ దీపారాధన' కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆలయ ఇంఛార్జ్ ఈవో హరీష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్నకూటోత్సవం అనంతరం.. దర్శనాలు నిలిపివేసి మధ్యాహ్నం 12 నుండి 2 గంటల వరకు.. రెండు గంటల పాటు గోష్టి, గర్భాలయ శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. అనంతరం అన్ని రకాల దర్శనాలను పునరుద్ధరించనున్నారు. ఇక సాయంత్రం 6:30 గంటలకు ప్రధానాలయ ముఖ మంటపంలో ఉన్న స్వర్ణ ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం.. ప్రధానాలయ తూర్పు రాజగోపురం ఎదుట 'ఆకాశ దీపారాధన' కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. మరోవైపు ఆలయంలో నిత్య పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. భక్తులు జరిపించిన పలు రకాల పూజలు, నిత్య కైంకర్యాల ద్వారా ఆదివారం ఆలయానికి రూ. 66,76,776 ఆదాయం సమకూరిందని ఆలయ ఆఫీసర్లు వెల్లడించారు.

# కొండపైన కొబ్బరికాయ రూ.100

**పట్టించుకోని అధికారులు, అధిక రేట్లతో దోచుకుంటున్న వ్యాపారులు**

యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: తెలంగాణ తిరుమలగా విరాజిల్లుతున్న యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో కొబ్బరికాయలు అమ్ముకునే వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో అధిక ధరలతో కొబ్బరికాయల వ్యాపారులు భక్తులను నిలువు దోపిడీ చేస్తున్నారు. కార్తీకమాసానికి తోడు ఆదివారం కావడంతో.. భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. ఇదే అదనుగా భావించిన వ్యాపారులు ఒక్కో కొబ్బరికాయ రూ. 100 లకు విక్రయిస్తున్నారు. ఇంత రేటా అని ప్రశ్నించిన భక్తులతో అది అంతే అని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. దీన్నంతటినీ తన సెల్ ఫోన్ లో రికార్డు చేసిన భక్తులు సోషల్ మీడియాలో షేర్ చేశారు. గ్రూపుల్లో పోస్ట్ చేసిన క్షణాల్లోనే వీడియోలు వైరల్ గా మారాయి. ఇంద జరుగుతున్నా ఆలయ అధికారులు మాత్రం చోద్యం చూశారే తప్ప ఎలాంటి చర్యలు చేపట్టలేదు.

**విదేశాల్లో ఉన్నతాధికారులు.. వ్యాపారుల ఇష్టారాజ్యం**



ఓవైపు పవిత్ర కార్తీకమాసం కావడం, మరోవైపు ఉన్నతాధికారులంతా విదేశాల్లో విహరిస్తుండడంతో.. కింది స్థాయి అధికారుల కనుసన్నల్లోనే ఇదంతా జరుగుతుందని భక్తులు ఆరోపిస్తున్నారు. రెగ్యులర్ ఈవో వెంకటరావు సెలవు పేరుతో నెల నుండి అమెరికాలో పర్యటిస్తున్నారు. విదేశాల్లో కల్యాణం పేరుతో ఆలయ చైర్మన్ నరసింహమూర్తి, డిప్యూటీ ఈవో దోర్బల భాస్కర్ శర్మ, ప్రధానార్చకులు కాండూరి వెంకటాచార్యులు, ఉప ప్రధానార్చకులు నరసింహమూర్తి, ముఖ్య అర్చకులు కిరణ్ బృందం యూకేలో విహరిస్తున్నారు. ఇక ఇంఛార్జ్ ఈవోగా బాధ్యతలు చేపట్టిన ఐఏఎస్ అధికారి రవినాయక్ కూడా సెలవుపై వెళ్లడంతో.. ఎండోమెంట్ కమిషనర్ హరీష్ ప్రస్తుతం ఆలయ ఇంఛార్జ్ ఈవోగా వ్యవహరిస్తున్నారు. కార్తీక మాసంలో భక్తుల రద్దీ అధికంగా ఉంటుందని తెలిసినా.. ఈవో సహా ఉన్నతాధికారులంతా విదేశాల్లో విహరిస్తుండడం, ఇంఛార్జ్ ఈవో అందుబాటులో లేకపోవడంతో.. కింది స్థాయి అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కింది స్థాయి అధికారుల అండదండలతోనే కొబ్బరికాయ వ్యాపారులు ఇష్టారీతిన రేట్లు పెంచి భక్తులను దోచుకుంటున్నారని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం 3 నవంబర్ 2025





# సన్నబియ్యం పథకాన్ని రద్దు చేసే దమ్ముందా?

**సీఎం రేవంత్‌కు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సవాల్..**

**కాంగ్రెస్‌కు ఓటేయకపోతే బెదిరిస్తారా? అని ఆగ్రహం**



**హైదరాబాద్, నవంబరు 2 :** దమ్ముంటే సన్న బియ్యం పథకాన్ని రద్దు చేయాలని సీఎం రేవంత్ రెడ్డికి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సవాల్ చేశారు. కాంగ్రెసకు ఓటు వేయకపోతే సన్న బియ్యం ఇవ్వడం మానేస్తామంటూ సీఎం హెూదాలో రేవంత్ బెదిరింపులకు దిగడం ఎంత వరకు సబబు? అని మండిపడ్డారు. ఈ బెదిరింపులు జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో ఓడిపోతామనే నిరాశతోనా? లేదంటే ఇది కాంగ్రెస్ మార్కు రాజకీయమా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ నిధులతో ఏమైనా బియ్యం ఇస్తున్నారా? అని నిలదీశారు. సన్నబియ్యం పథకాన్ని కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా అమలు చేస్తోందని, కిలోకు రూ.42 చొప్పున కేంద్రం చెల్లిస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం రూ.15మాత్రమే ఇస్తోందని కిషన్‌రెడ్డి వివరించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ సమస్యలను, ప్రజల ఇబ్బందులను పరిష్కరించగల ఏకైక పార్టీ బీజేపీయేనని, ఉప ఎన్నికలో తమ పార్టీ అభ్యర్థి దీపక్ రెడ్డిని గెలిపించాలని కోరారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో విలేకర్లతో, యూసుఫగూడలోని కృష్ణకాంత్ పార్క్‌లో ఉదయపు నడకకు వచ్చి న ప్రజలతో కిషన్ రెడ్డి మాట్లాడారు. జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ హద్దులు దాటి మితిమీరి వ్యవహరిస్తోందని, సీఎం రేవంత్ రెడ్డి అబద్ధాలను ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. బంజారాహిల్స్‌లో పెద్దమ్మ గుడికి స్థలం ఇవ్వడానికి ముందుకు రాని రాష్ట్ర ప్రభుత్వం.. ఖబరస్థాన్ కోసం మాత్రం ఎకరాల కొద్దీ భూములను ధారాదత్తం చేసిందని ఆయన ఆరోపించారు.

**ఓటమి భయంలో కాంగ్రెస్: రాంచందర్‌రావు**

ఉప ఎన్నికలో కాంగ్రెసను ఓటమి భయం వెంటాడుతోందని, అందుకే సీఎం రేవంత్ ఎన్నికల ముందు ఓ మైనారిటీని మంత్రిని చేసి గంపగుత్తగా ఓ వర్గం ఓట్ల కోసం ఆరాట పడుతున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు దుయ్యబట్టారు. బెదిరించి ఓట్లు కొల్లగొట్టాలని కాంగ్రెస్ చూస్తుండ గా.. డబ్బులు వెదజల్లి ఓట్లు రాబట్టుకోవాలని బీఆర్ఎస్ భావిస్తోందని విమర్శించారు. జూబ్లీహిల్స్ పరిధిలో బీజేపీ ఆదివారం మహా పాదయాత్ర నిర్వహించింది. శ్రీకృష్ణానగర్-ఏ బ్లాక్‌లో ఎంపీ రఘునందన్‌రావు, బోరబండలో ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి, శ్రీనగర్‌లో కాలనీ పార్క్‌లో మల్కా కొమరయ్య పాదయాత్ర చేశారు. రహ్మత్‌నగర్‌లో పాదయాత్రను రాంచందర్‌రావు ప్రారంభిస్తూ మాట్లాడారు. కాగా, బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో వనపర్తి జిల్లాకు చెందిన పలువురు బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తలు పార్టీలో చేరారు.

# 500 రోజులు ఆగితే కేసీఆర్ ప్రభుత్వం

**హైడ్రా అరాచకాలకు పాల్పడుతోంది.. పేదల ఇళ్లపైకి బుల్డోజర్లు పంపి కూల్చేస్తోంది**

**మంత్రులు పొంగులేటి, వివేక్ ఇళ్లు చెరువుల్లోనే ఉన్నాయి**

**రేవంత్ సోదరుడు తిరుపతిరెడ్డి ఇల్లూ బఫర్ జోన్‌లోనే..**

**కూల్చే దమ్ము హైడ్రాకు ఉందా?: కేటీఆర్**



**హైదరాబాద్ :** మూసీ ప్రక్షాళన, హైడ్రా పేరుతో రేవంత్‌రెడ్డి సర్కారు అరాచకానికి పాల్పడుతోందని, ఎంతో మంది గూడు కోల్పోయారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఇళ్లు కోల్పోయిన వారికి న్యాయం చ్శేస బాధ్యత తనదని, 500 రోజులు ఆగితే కేసీఆర్ ప్రభుత్వం వస్తుందని పేర్కొన్నారు. హైడ్రా బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. 'పెద్దోళ్లకు ఓ న్యాయం.. పేదలకు ఒక న్యాయం' పేరిట ఆదివారం తెలంగాణభవన్‌లో ఎగ్జిబిషన్ నిర్వహించారు. హైడ్రా అరాచకాలకు పాల్పడుతోందంటూ కేటీఆర్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడారు. "కేసీఆర్ హయాంలో ఎక్కడచూసినా కట్టడాలే కనిపిస్తాయి. హైదరాబాద్‌లోనే లక్ష డబుల్ బెడ్రూం ఇళ్లు కట్టించాం. అమెరికా వైట్‌హౌసను తలదన్నేలా రాష్ట్ర సచివాలయం, దేశంలోనే అతిపెద్ద పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్, 42 ఫ్లైఓవర్లు, అండర్ పాస్‌లు ఇలా ఎన్నో నిర్మించాం. కానీ రేవంత్‌రెడ్డి గత రెండేళ్లలో కూలగొట్టడమే తప్ప కొత్తగా నిర్మించిందేమీ లేదు. హైడ్రాపై భట్టి విక్రమార్క ఇచ్చిన ప్రజంటేషన్‌లో చాలామంది బిల్డర్ల పేర్లు చెప్పారు. వారెవరినీ ఇబ్బంది పెట్టలేదు. కానీ పేదల ఇళ్లపైకి బుల్డోజర్లు పంపి కూలగొట్టి, వారికి నీడలేకుండా చేశారు. కొండాపూర్‌లో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేసుకున్న కొందరికి గతంలో ప్రభుత్వం ప్లాట్లు ఇచ్చింది. ఇప్పుడు హైడ్రా వారిని కూడా వెళ్లగొట్టింది. హైడ్రా చ్శేసది న్యాయమే అయితే.. ముందుగా నోటీసులు ఎందుకు ఇవ్వరు, బాధితులు చూపుతున్న పేపర్లను ఎందుకు పరిశీలించరు? ప్రభుత్వానికి అంతా సమానమైతే పెద్ద వాళ్ల జోలికి ఎందుకు వెళ్లడం లేదు? మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెరువును పూడ్చి ఇల్లుకట్టారు. మరో మంత్రి వివేక్ కూడా హిమాయత్‌సాగర్ చెరువు వద్ద ఇల్లు కట్టుకున్నారు. రేవంత్‌రెడ్డి అన్న తిరుపతిరెడ్డి దుర్గంచెరువు ఎఫ్‌టీఎల్ లోపల ఇల్లుకట్టారు. వారి ఇళ్లను కూల్చేదమ్ము హైడ్రాకు ఉందా?" అని కేటీఆర్ నిలదీశారు. ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి చెరువుల్లోనే ఇళ్లు కట్టుకున్నారని, వారికి నోటీసులు ఇచ్చే దమ్ము అధికారులకు ఉందా అని ప్రశ్నించారు. కాగా, బీజేపీ నేత, మాజీ కార్పొరేటర్ నవతారెడ్డి ఆదివారం తెలంగాణభవన్‌లో కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎసలో చేరారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ గెలుపుతోనే కాంగ్రెస్ అరాచకాలకు అంతమని ఈ సందర్భంగా కేటీఆర్ పేర్కొన్నారు.

**కాంగ్రెస్ నోట్లతో ఓట్లు కొనాలనుకుంటోంది**

విద్యావంతులు ఎక్కువగా ఉండే హైదరాబాద్‌లో ఓటింగ్ శాతం తక్కువగా ఉండడం బాధాకరమని కేటీఆర్ పేర్కొన్నారు. ఒక్కరు ఓటు వేయకున్నా కాంగ్రెస్ రిగ్గింగ్ చేసి ఆ ఓట్లు వేసుకుంటుందని ఆరోపించారు. ఆదివారం షేక్‌పేటలోని ఆదిత్య ఇంప్రెస్, సత్వ గేటెడ్ కమ్యూనిటీల్లో నిర్వహించిన సమావేశాల్లో కేటీఆర్ మాట్లాడారు. తాము పదేళ్లలో పేదల కోసం, హైదరాబాద్ అభివృద్ధి కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టామన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క హామీ అమలు చేయలేదని విమర్శించారు. మరోవైపు.. కాంగ్రెస్ గూండాలు మణుగూరు బీఆర్ఎస్ కార్యాలయంపై దాడి చేసి, దహనం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని కేటీఆర్ పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు రేగా కాంతారావుతో ఫోన్‌లో మాట్లా డి వివరాలు తెలుసుకున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన మొదలైన నాటి నుంచి గూండాల రాజ్యం నడుస్తోందని మండిపడ్డారు.

# మణుగూరులో బీఆర్ఎస్ పార్టీ ఆఫీసుపై కాంగ్రెస్ శ్రేణుల దాడి..

**గతంలో అది తమ ఆఫీసేనని.. బీఆర్ఎస్ హయాంలో ఆక్రమించారని ఆరోపణ**

**'ఇందిరమ్మ భవనం' అంటూ ఫ్లెక్సీ ఏర్పాటు**

**పట్టణంలో పోలీసుల మోహరింపు**

**ముమ్మాటికి అది కాంగ్రెస్ కార్యాలయమే: స్థల దాత వారసుడు హరిబాబు**




మణుగూరు, నవంబరు 2 : తమ పార్టీ కార్యాలయాన్ని గతంలో బీఆర్ఎస్ నేతలు కబ్జా చేశారని ఆరోపిస్తూ కాంగ్రెస్ శ్రేణులు కొత్తగూడెం జిల్లా మణుగూరులోని ప్రస్తుత బీఆర్ఎస్ పార్టీ ఆఫీసుపై దాడి చేసి ఫర్నిచర్, ఇతర వస్తువులను తగులబెట్టాయి. భవనంపై ఉన్న గులాబీ రంగును, బీఆర్ఎస్ జెండాను తొలగించి కాంగ్రెస్ జెండాలు, ఫ్లెక్సీలను ఏర్పాటు చేశాయి. దీంతో పట్టణంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఆదివారం ఉదయాన్నే వందలాది సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడి నుంచి ప్రదర్శనగా బీఆర్ఎస్ ఆఫీసుకు వెళ్లారు. అనంతరం లోపలికి ప్రవేశించి.. కార్యాలయంలోని ఫర్నిచర్‌ను విరగ్గొట్టారు. ఆ తర్వాత బీఆర్ఎస్ నేతలను బయటికి తోసేసి ఫర్నిచర్‌ను బయట పడేసి పెట్రోల్ పోసి నిప్పంటించారు. జై కాంగ్రెస్.. జై జై కాంగ్రెస్.. ఎమ్మెల్యే పాయం నాయకత్వం వర్ధిల్లాలి.. అంటూ బిగ్గరగా నినాదాలు చేసి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులకు మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం చోటు చేసుకుంది. ఆగ్రహానికి గురైన కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎసకు చెందిన ఒకరిద్దరు కార్యకర్తలపై పిడిగుద్దులు కురిపించి.. కార్యాలయం నుంచి బయటకు గెంటేశారు. ఈ దాడిలో ఓ బీఆర్ఎస్ కార్యకర్తకు గాయమైంది. ఆగ్రహావేశాలతో ఉన్న కాంగ్రెస్ కార్యకర్తలు కార్యాలయ భవనం పైకి ఎక్కి బీఆర్ఎస్ జెండాలను పీకేసి.. కాంగ్రెస్ జెండాలను ఏర్పాటు చేశారు. మణుగూరు డీఎస్పీ రవీంద్రరెడ్డి, సీఐ నాగబాబు, ఎస్సై శ్రావణ్ కుమార్ ఘటనా స్థలికి చేరుకొని పరిస్థితిని అదుపు చేసేందుకు ప్రయత్నించారు. అప్పటికే వందల సంఖ్యలో కాంగ్రెస్ శ్రేణులు చేరుకోవడంతో.. పరిస్థితి అదుపులోకి రాలేదు. దీంతో జిల్లా పోలీసు ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. ఈ క్రమంలోనే కాంగ్రెస్ నాయకులు.. భవనంపై ఉన్న గులాబీ రంగు పెయింట్లను తొలగించి, ఇందిరమ్మ భవనం అంటూ ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. అనంతరం కార్యాలయాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ప్రకటించారు. మరోవైపు.. ఫర్నిచర్ దహనంతో మంటలు చెలరేగి, దట్టమైన పొగలు రావడంతో.. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. ఏడేళ్ల క్రితం మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు తమ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని స్వాధీనం చేసుకుని బీఆర్ఎస్ భవనంగా మార్చారని, ఏడేళ్ల నుంచి నిరీక్షించిన తమకు ఈ రోజుతో కార్యాలయాన్ని తిరిగి హస్తగతం చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఆ తర్వాత కాంగ్రెస్ నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకులు మరోమారు కార్యాలయంలోకి ప్రవేశించే యత్నం చేయ గా.. పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వారు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో ఎస్పీ వెంటనే మణుగూరుకు స్పెషల్ పార్టీ బలగాలను పంపించి, బందోబస్తు ఏర్పాటు చేశారు. ముందు జాగ్రత్త చర్యగా మణుగూరులో 144 సెక్షన్ విధించారు.

**బీఆర్ఎస్ నాయకుల ఆందోళన**

తమ కార్యాలయంలో విధ్వంసానికి పాల్పడిన కాంగ్రెస్ నాయకులను వెంటనే ఇక్కడి నుంచి వెనక్కి పంపించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మణుగూరులోని ప్రధాన రోడ్డుపై ఆందోళన చేశారు. వారికి సర్దిచెప్పేందుకు మణుగూరు సీఐ నాగబాబు, ఇతర పోలీసు అధికారులు ఎంత ప్రయత్నించినా.. ఫలితం కనిపించలేదు. కాంగ్రెస్ నేతలను పంపితేనే తాము వెళ్తామంటూ.. బీఆర్ఎస్ నాయకులు భీష్మించుకు కూర్చున్నారు. దీంతో ఇరుపక్షాల మధ్య కొంత దూరాన్ని ఏర్పాటు చేసి స్పెషల్‌పార్టీ బలగాలు.. ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా చూశాయి.

**ఎంతో సంతోషంగా ఉంది: ఎమ్మెల్యే పాయం**

తమ శ్రమతో పైసా పైసా కూడబెట్టుకుని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కాంగ్రెస్ కార్యాలయంగా ఇందిరమ్మ భవనాన్ని నిర్మించుకుంటే దాన్ని కబ్జా చేసి తెలంగాణ భవన్‌గా మార్చారని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. అందుకే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తిరిగి తమ కార్యాలయాన్ని స్వాధీనం చేసుకున్నారని చెప్పారు. వారి శ్రమకు ప్రతిఫలం దక్కిందని, తమకు ఇది ఎంతో సంతోషంగా ఉందని అన్నారు.

**దాడులు, బెదిరింపులకు మేము భయపడబోం: మాజీ ఎమ్మెల్యే రేగా**

కాంగ్రెసకు జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ఓటమి భయం పట్టుకుందని, రాష్ట్రంలో ఇలాంటి గొడవలు చేసి ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూస్తోందని మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. ఆదివారం సాయంత్రం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడారు. ఇలాంటి దాడులకు, బెదిరింపులకు తాను భయపడబోమన్నారు. గత ఎన్నికల ప్రచారంలో నేటి సీఎం రేవంత్ రెడ్డి.. తనను గుడ్డలూడదీసి తన్నిస్తానని హెచ్చరికలు చేశారని, అందుకే ఇలా దాడులకు పాల్పడుతున్నారని తెలిపారు. భవనానికి సంబంధించి అన్ని డాక్యుమెంట్లు తమ వద్ద ఉన్నాయని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల కోసం అవసరమైతే కొత్త భవనాన్ని నిర్మించి ఇస్తానని తెలిపారు.

**ముమ్మాటికీ కాంగ్రెస్ కార్యాలయమే**

మణుగూరులోని ప్రధాన ర హదారి పక్కన ఉన్న పార్టీ కార్యాలయం ముమ్మటికీ కాంగ్రెస్ పార్టీదేనని స్థల దాత వారసుడు పీకేఎస్ హరిబాబు అన్నారు. 1980లో తన తండ్రి పిళ్ళారిశెట్టి సత్యనారాయణ వద్దకు నాటి ఎమ్మెల్యే చందాలింగయ్య, మండల కాంగ్రెస్ నాయకులు బత్తుల వీరయ్య, పోలమూరి రాజు వచ్చి కాంగ్రెస్ కార్యాలయం కోసం స్థలం అడిగారని తెలిపారు. కాంగ్రెసపై అభిమానంతో తన తండ్రి ఈ స్థలాన్ని కేటాయించగా.. అక్కడ భనవాన్ని నిర్మించి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంగా ఏర్పాటు చేసినట్టు తెలిపారు. తర్వాత నాయకులు పార్టీలు మారారని, ఆ తర్వాత కార్యాలయాన్ని మార్చారని చెప్పారు.

**నేపథ్యం ఇదీ..**

కాంగ్రెస్ పార్టీ టికెట్‌పై తొలిసారి 2009, ఆ తర్వాత 2018 చివర్లో జరిగిన ఎన్నికల్లో మరోసారి పినపాక ఎమ్మెల్యేగా రేగాకాంతారావు గెలిచారు. అనంతరం 2019లో ప్రజా అభివృద్ధే ధ్యేయంగా టీఆర్ఎస్ (ప్రస్తుతం బీఆర్ఎస)లో చేరుతున్నట్లు ప్రకటించి పార్టీ మారారు. అప్పటి వరకు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంగా ఉన్న ఈ భవనాన్ని ఆ తర్వాత టీఆర్ఎస్ పార్టీ కార్యాలయంగా రేగా కాంతారావు మార్చారు. దీంతో అప్పుడే ఈ విషయాన్ని తీవ్ర స్థాయిలో ఖండించిన నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆందోళనలు చేశారు. పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో నిరాహార దీక్షలను కూడా చేపట్టారు. ఈ విషయంపై జరిగిన ఆందోళనలకు సంపూర్ణ మద్దతు తెలుపుతూ.. అప్పటి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పొదెం వీరయ్య, మధిర ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క, ములుగు ఎమ్మెల్యే సీతక్క, మాజీ ఎంపీ బలరామ్, తదితరులు కూడా ఆందోళనలో పాల్గొన్నారు. మణుగూరు మునిసిపల్ కార్యాలయానికి వెళ్లి అధికారులను ప్రశ్నించారు. ఖచ్చితంగా ఇది కాంగ్రెస్ పార్టీకే చెందాలని చెప్పి వెళ్లారు.



ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
3 నవంబర్
2025



# నింగిలోకి ఎల్వీఎం3-ఎం5

**భారత గడ్డపై నుంచి తొలి భారీ ఉపగ్రహం**

**ఎల్వీఎం3-ఎం5 రాకెట్ ప్రయోగం విజయవంతం**

**16.29 నిమిషాల్లోనే కక్ష్యలోకి సీఎంఎస్-03 శాటిలైట్**

**భారీ ఉపగ్రహ ప్రయోగంతో కొత్త చరిత్ర సృష్టించిన ఇస్రో**

**ఎల్వీఎం3 ప్రయోగాల్లో వరుసగా ఎనిమిదో విజయం చరిత్రలో మైలురాయి: ఇస్రో చైర్మన్ నారాయణన్**

**నిప్పులు చిమ్ముతూ నింగిలోకి దూసుకెళ్తున్న ఎల్వీఎం3-ఎం5 రాకెట్**



**సూళ్లూరుపేట, నవంబరు 2 :** భారత నేలపై నుంచి తొలిసారిగా అత్యంత బరువైన స్వదేశీ ఉపగ్రహం సీఎంఎస-3ను ఇస్రో విజయవంతంగా కక్ష్యలోకి చేర్చింది. భారత నౌకాదళం కోసం ఇస్రో చేపట్టిన భారీ ఉపగ్రహ ప్రయోగం విజయవంతమైంది. 4,410 కిలోల బరువైన మల్టీ బ్రాండ్ కమ్యూనికేషన్ శాటిలైట్ సీఎంఎస-3తో నింగిలోకి ఎగిరిన ఎల్‌వీఎం3-ఎం5 'బాహుబలి' రాకెట్ దాన్ని విజయవంతంగా కక్ష్యలోకి చేర్చింది. ఈ క్రమంలో ఎల్‌వీఎం3 రాకెట్ ప్రయోగాల్లో ఇస్రో వరుసగా 8వ విజయాన్ని ఖాతాలో వేసుకుంది. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీశ్‌ధావన్ అంతరిక్ష కేంద్రం (షార్) రెండో ప్రయోగ వేదిక నుంచి ఆదివారం సాయంత్రం 5:26 గంటలకు నిప్పులు చిమ్ముకుంటూ నింగిలోకి ఎగిరిన ఎల్‌వీఎం3-ఎం5 రాకెట్.. తన మూడు దశలను సునాయాసంగా పూర్తి చేసుకుని 4,410 కిలోల బరువైన సీఎంఎస్-3 ఉపగ్రహాన్ని 16.29 నిమిషాల్లోనే నిర్ణీత కక్ష్యలో విడిచిపెట్టింది. ఆ వెంటనే మిషన్ కంట్రోల్ సెంటర్‌లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ సహచర శాస్త్రవేత్తలను ఆలింగనం చేసుకొని ఆనందాన్ని పంచుకున్నారు. అనంతరం ఎల్వీఎం3-ఎం5 రాకెట్ విజయవంతమైందని ప్రకటించారు.

**వచ్చే ఐదు నెలల్లో ఏడు ప్రయోగాలు**

ఎల్వీఎం3-ఎం5 రాకెట్ ప్రయోగం దేశానికే గర్వకారణమని ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ అన్నారు. ఈ విజయం ఇస్రో చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోతుందన్నారు. సీఎంఎస్-03 విజయానంతరం ఆయన మీడియా సెంటర్‌లో మాట్లాడుతూ.. 'కక్ష్యలోకి విజయవంతంగా చేరిన ఉపగ్రహం స్థిరంగా ఉన్నట్లు బెంగుళూరులోని హసన్ మాస్టర్ కంట్రోల్ సెంటర్ గ్రౌండ్ స్టేషన్‌కు సిగ్నల్ అందాయి. ఇది ఇస్రో పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన కమ్యూనికేషన్ ఉపగ్రహం. దీని బరువు 4,410 కిలోలు. ఈ ప్రయోగంతో భారత్ మరో ఘనత సాధించింది' అని తెలిపారు. వచ్చే ఐదు నెలల్లో ఏడు ప్రయోగాలు చేపట్టేందుకు ప్రణాళికలు రచించామని తెలిపారు. డిసెంబరు తొలివారంలో ఎల్వీఎం3-ఎ06 రాకెట్ ద్వారా అమెరికాకు చెందిన బ్లూబర్డ్ కమ్యూనికేషన్ ఉపగ్రహాన్ని ప్రయోగిస్తామని, డిసెంబరు చివరిలో పీఎసఎల్వీ-సీ62 ద్వారా ఈవోఎస్-05 ఉపగ్రహ ప్రయోగం ఉంటుందని తెలిపారు. వచ్చే ఏడాది జీఎసఎల్వీ-ఎఫ్17 రాకెట్ ప్రయోగం ఉంటుందన్నారు. పీఎసఎల్వీ-ఎల్1, ఎస్ఎసఎల్వీ, గగన్‌యాన్ క్రూ మాడ్యూల్ ప్రయోగ పనులు కూడా జరుగుతున్నాయన్నారు.

**భారత్ నుంచి ఇదే తొలిసారి**

ఇస్రో గతంలో కూడా ఇంతటి భారీ ఉపగ్రహాలను ప్రయోగించింది. కానీ.. అవన్నీ ఫ్రెంచ్ గయానా నుంచి ఫ్రాన్స్‌కు చెందిన ఏరియన్ స్పేస్ అందించిన రాకెట్ల ద్వారా ప్రయోగించినవే. 2018 డిసెంబరు 18న ఫ్రెంచ్ గయానా నుంచి 5,854 కిలోల బరువున్న కమ్యూనికేషన్ ఉపగ్రహం జీశాట్-11ను ఇస్రో ప్రయోగించింది. భారత భూభాగం నుంచి జియో ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్ (జీటీవో)లో ప్రవేశపెట్టిన తొలి భారీ ఉపగ్రహం సీఎంఎస్-03 కావడం విశేషం.

**ప్రధాని, ఉపరాష్ట్రపతి అభినందనలు**

భారత గడ్డపై నుంచి తొలిసారిగా అత్యంత బరువైన కమ్యూనికేషన్ ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించిన ఇస్రోను ప్రధాని మోదీ, ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ అభినందించారు. 'మన శాస్త్రవేత్తల కృషితో అంతరిక్ష రంగం అద్భుతమైన ఆవిష్కరణలకు పర్యాయపదంగా మారడం ప్రశంసనీయం. ఇస్రో శాస్త్రవేత్తలు సాధించిన విజయాలు జాతీయ పురోగతిని పెంచాయి' అని మోదీ ఎక్స్‌లో పోస్టు చేశారు. 'ఇస్రో, భారత నావికా దళానికి అభినందనలు. ఈ విజయం ఆత్మనిర్భర్ భారత్‌లో మరో గర్వించదగిన మైలురాయికి చిహ్నం' అని ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ అన్నారు.

**సీ25 క్రయోజనిక్ దశపై కొత్త ప్రయోగం**

ఎల్‌వీఎం3-ఎం5 రాకెట్‌కు సంబంధించిన సీ25 క్రయోజనిక్ దశపై కొత్త ప్రయోగం నిర్వహించామని ఇస్రో చైర్మన్ నారాయణన్ తెలిపారు. "దేశీయంగా అభివృద్ధి చేసిన సీ25 క్రయోజనిక్ దశను.. రాకెట్ ఉపగ్రహాన్ని కక్ష్యలోకి చేర్చిన తర్వాత మరోసారి మండించాం. అది విజయవంతమైంది. ఇదొక గొప్ప ప్రయోగం. భవిష్యత్తులో క్రయోజనిక్ దశను పునఃప్రారంభించడానికి అవసరమైన డేటాను అందిస్తుంది. ఎల్‌వీఎం3 రాకెట్‌ను ఉపయోగించి బహుళ ఉపగ్రహాలను వివిధ కక్ష్యల్లోకి ప్రవేశపెట్టేందుకు అవకాశం కల్పిస్తుంది' అని నారాయణన్ తెలిపారు.

**జీశాట్-7 సిరీస్.. నిఘాకు, రక్షణకు..**

భారత్ రక్షణపరంగా, నిఘా కోసం, సరిహద్దుల వెంట, సముద్రంలో పరిస్థితుల సమాచారం, కమ్యూనికేషన్ కోసం ప్రత్యేకంగా జీశాట్-7 సిరీస్ ఉపగ్రహాలు ప్రయోగిస్తోంది. అందులో మొదటిది జీశాట్-7. 2,625 కిలోల ఆ ఉపగ్రహాన్ని 2013లో ఫ్రెంచ్ గయానా నుంచి అంతరిక్షంలోకి పంపారు. నౌకాదళం కోసం ప్రత్యేకించిన ఉపగ్రహం. దాని కాలపరిమితి ముగింపునకు రావడంతో.. ఆ స్థానంలో ఆధునికమైన, సమర్థవంతమైన సీఎంఎస్03 (జీశాట్-7ఆర్) ఉపగ్రహాన్ని ఇప్పుడు ప్రయోగించారు. ఇక వైమానిక దళం, సైన్యం కోసం ప్రత్యేకించిన జీశాట్-7ఏను 2018లో ప్రయోగించారు. దాని స్థానంలో ఆర్మీ కోసం మరింత మెరుగైన ఉపగ్రహం జీశాట్-7బీని అభివృద్ధి చేస్తున్నారు.

**ఎల్‌వీఎం-3.. గగనయానం**

సీఎంఎస్03 ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి తీసుకెళ్లిన ఎల్‌వీఎం-3(లాంచ్ వెహికల్ మార్క్-3) రాకెట్‌ను భారత 'బాహుబలి'గా పిలుస్తారు. జీఎసఎల్వీ మార్క్-3 రాకెట్‌కు పలు మార్పులు చేసి దీనిని అభివృద్ధి చేశారు. దీని బరువు 640 టన్నులు, ఎత్తు 43.5 మీటర్లు. మూడు దశల ఇంధనంతో అంతరిక్షంలోకి దూసుకెళుతుంది. చివరి దశలో భారత్ అభివృద్ధి చేసిన 'సీఈ-20' క్రయోజనిక్ ఇంజన్‌ను అమర్చారు. భూసమీప కక్ష్య (ఎల్ఈవో)లోకి పది వేల కిలోల పేలోడ్‌ను, జీటీవో కక్ష్యలోకి 4,500 కిలోల పేలోడ్‌ను మోసుకెళ్లగలదు. సమీప భవిష్యత్తులో భారత్ చేపట్టనున్న చంద్రయాన్, గగన్‌యాన్ ప్రయోగాలన్నీ ఎల్‌వీఎం-3తోనే జరగనున్నాయి. ఇక ఎల్‌వీఎంను మరింత అభివృద్ధి చేసి 'నెక్ట్స్ జనరేషన్ లాంచ్ వెహికల్ (ఎన్‌జీఎల్‌వీ)'ని రూపొందించేందుకు ఇస్రో ప్రయత్నిస్తోంది. ఎనిమిది టన్నుల బరువైన పేలోడ్లను జీటీవో (జియోసింక్రనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్) కక్ష్యలోకి చేర్చేలా దానిని అభివృద్ధి చేయనున్నారు.

**సీఎంఎస్03.. సురక్షిత తీరం**

భారత సముద్ర తీరం నుంచి సుమారు 3,500 కిలోమీటర్ల దూరం వరకు మన నౌకా దళానికి అవసరమైన సేవలను సీఎంఎస్03 ఉపగ్రహం అందిస్తుంది. దీనిలో యూహెచ్‌ఎఫ, ఎస్, సీ, కేయూ బ్యాండ్ రాడార్లను అమర్చారు. దీని సాయంతో తీర ప్రాంతమంతటా నిఘా పెట్టడంతోపాటు ఒకే సమయంలో అత్యంత వేగంగా వివిధ రకాల కమ్యూనికేషన్లకు వీలు కల్పిస్తుంది. సముద్రంలో ఉన్న యుద్ధ నౌకలు, జలాంతర్గాములు, సముద్రంపై ఎగురుతున్న యుద్ధ విమానాలు, హెలికాప్టర్ల నుంచి.. నౌకాదళ ప్రధాన కార్యాలయానికి ఎప్పటికప్పుడు డేటాను అందిస్తుంది. అది కూడా మధ్యలో గుర్తించలేని విధంగా, హ్యాక్ చేయలేని విధంగా డేటాను, కాల్స్‌ను ఎన్‌క్రిప్ట్ చేసి, సురక్షితమైన కమ్యూనికేషన్‌ను అందిస్తుంది. ఈ ఉపగ్రహం నుంచి నౌకాదళానికి చేరే సమాచారాన్ని, కాల్స్‌ను, సిగ్నల్స్‌ను మధ్యలో ఎవరూ జామ్ చేయకుండా ప్రత్యేకమైన సాంకేతికతను వినియోగించారు.

# పెద్ద వ్యాపారుల చేతిలో మోదీ రిమోట్ కంట్రోల్

**చిన్న వ్యాపారులను నాశనం చేసి బడా వ్యాపారవేత్తలకు మేలు చేయడమే మోదీ లక్ష్యం**

**దానిలో భాగంగానే జీఎస్టీ, నోట్ల రద్దు**

**బిహార్ ఎన్నికల ప్రచారంలో రాహుల్ గాంధీ**

**చెరువులో దిగి చేపలు పట్టిన ప్రతిపక్ష నేత**

**18న సీఎంగా ప్రమాణం చేస్తున్నా: తేజస్వి**



**ఢిల్లీ, నవంబరు 2:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అంటే భయపడటమే కాకుండా పెద్ద వ్యాపారవేత్తలు ఆడించినట్లల్లా ఆడుతున్నారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఆదివారం బిహార్‌లోని బెగూసరాయ్, ఖగారియా జిల్లాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభల్లో రాహుల్ మాట్లాడుతూ 'మహాత్మాగాంధీ నాటి శక్తిమంతులైన బ్రిటీష్‌వారిని ఎదిరించారు. మరోవైపు 56 అంగుళాల ఛాతీ ఉన్న మన మోదీ ఆపరేషన్ సిందూర్ సమయంలో ట్రంప్ ఫోన్ చేయగానే భయపడిపోయి పాకిస్థాన్‌పై యుద్ధాన్ని ఆపేశారు. అంబానీ, అదానీ రిమోట్ కంట్రోల్ ద్వారా మోదీని ఆడిస్తున్నారు. చిన్న వ్యాపారవేత్తలను నాశనం చేసి, పెద్ద వ్యాపారవేత్తలకు మేలు చేసే లక్ష్యంతోనే మోదీ ప్రభుత్వం జీఎస్టీ, పెద్ద నోట్ల రద్దు తదితర ప్రధాన నిర్ణయాలన్నీ తీసుకుంది' అని ఆరోపించారు. కాగా, గత 20 ఏళ్లుగా బిహార్ యువత అవకాశాలను, కలలనూ బీజేపీ, జేడీయూ దూరం చేశాయని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే విమర్శించారు. బిహార్ ఆత్మగౌరవాన్ని పునరుద్ధరించాల్సిన సమయం ఆసన్నమైందని 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. పారిశ్రామిక రంగంలో ఉపాధి విషయంలో దేశంలోనే 23వ స్థానంలో బిహార్ ఉందని ఖర్గే తెలిపారు. బిహార్‌లోని 10 శాఖల్లో జరిగిన రూ.70 వేల కోట్ల కుంభకోణాలను కాగ్ వెలుగులోకి తెచ్చిందని, దీన్ని అచ్చేదిన్‌కు సంకేతంగా భావించాలా? అని జైరాం రమేశ్ ప్రశ్నించారు. కాగా, బెగూసరాయ్‌లో ఎన్నికల ప్రచారం అనంతరం రాహుల్‌గాంధీ మత్స్యకారులతో కలిసి పడవలో చెరువు మధ్యలోకి వెళ్లి చేపలు పట్టారు. అనంతరం నీటిలోకి దిగి కూడా భారీ వలతో చేపల వేట కొనసాగించారు. ఈత కూడా కొట్టారు. ఆయన వెంట ఇండియా కూటమి ఉపముఖ్యమంత్రి అభ్యర్థి ముకేశ్ సాహ్నీ కూడా ఉన్నారు.



# ఆపరేషన్ సిందూర్ నుంచి వారింకా తేరుకోలేదు

**పాక్‌పై బాంబులేస్తే..కాంగ్రెస్ రాచకుటుంబానికి నిద్ర లేదు: మోదీ**

**పట్నాలో భారీ రోడ్‌షో ... బిహార్ మహాగఠ్‌బంధన్‌లో తీవ్ర విభేదాలు**

**వారి మేనిఫెస్టో అబద్ధాల పుట్ట: ప్రధాని**

**పట్నా, నవంబరు 2:** పాకిస్థాన్‌లో పేలుళ్లు సంభవిస్తే కాంగ్రెస్ 'రాచకుటుంబా'నికి నిద్ర దూరమైందని ప్రధాని మోదీ ధ్వజమెత్తారు. 'ఆపరేషన్ సిందూర్' నుంచి పాక్‌తోపాటు కాంగ్రెసలోని పేరుగొప్ప నాయకులు ఇంకా తేరుకోలేదని ఎద్దేవా చేశారు. బిహార్లో ఇండీ కూటమి పార్టీలతో కూడిన మహాగఠ్‌బంధన్‌లో తీవ్ర విభేదాలు ఉన్నాయన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఆయన అర్రాలో జరిగిన సభలో మాట్లాడారు. పట్నాలో భారీ రోడ్‌షో నిర్వహించారు. ఆయా సందర్భాల్లో మాట్లాడుతూ.. వికసిత్ భారత్ కోసం ఎన్‌డీఏ పార్టీలన్నీ కలిసికట్టుగా పనిచేస్తుంటే.. కాంగ్రెస్, ఆర్‌జేడీ మాత్రం పరస్పరం కొట్లాడుకుంటున్నాయని అన్నారు. 'ఓ అంతర్గత సమాచారం చెబుతున్నాను. నామినేషన్ల దాఖలుకు ముందు రోజు ఈ పార్టీలు నాలుగ్గోడల మధ్య సమావేశమయ్యాయి. ఆర్‌జేడీ నుంచి సీఎం అభ్యర్థి ఉండడం కాంగ్రెసకు ఇష్టం లేదు. దీంతో ఆ పార్టీ కాంగ్రెస్ తలపై తుపాకీ పెట్టి.. తేజస్వి యాదవే సీఎం అభ్యర్థి అని బలవంతంగా ప్రకటించేలా చేసింది. ఎన్నికల ముందే తీవ్ర విభేదాలు తలెత్తాయంటే.. ఎన్నికల తర్వాత తలలు పగలగొట్టుకుంటారు' అని విరుచుకుపడ్డారు. ఆర్‌జేడీ హయాంలో బీజేపీలో 'కట్టా (తుపాకీ), క్రూరత, కటుతా (కాఠిన్యం), కుశాసన్ (దుష్పరిపాలన), కరప్షన్ (అవినీతి)'తో కూడిన ఆటవిక రాజ్యం నడిచేదన్నారు. ఇప్పుడు చొరబాటుదార్లకు మద్దతివ్వడం ద్వారా, వారి కోసం యాత్రలు చేయడం ద్వారా బిహార్ గుర్తింపును మటుమాయం చేయాలని, చొరబాటుదార్లను ఎలాగైనా కాపాడుకోవాలని కాంగ్రెస్ కూటమి చూస్తోందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో పీఎం కిసాన్ సమ్మాన్ నిధిని ఇప్పుడున్న రూ.6 వేల నుంచి రూ.9 వేలకు పెంచుతున్నట్లు ప్రధాని ప్రకటించారు. మహాగఠ్‌బంధన్ మేనిఫెస్టోను అబద్ధాలపుట్టగా అభివర్ణించారు.

**బిహార్‌లో హింసను సహించం: సీఈసీ**

బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాంటి హింసాత్మక సంఘటనలనూ సహించబోమని సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ అన్నారు. శాంతియుత వాతావరణంలో పారదర్శకంగా ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పారు. ఓటర్లందరూ స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆదివారం ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. బిహార్‌లో 243 మంది ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, అదే సంఖ్యలో పరిశీలకులు, జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, పోలీసు పరిశీలకులు, ఎన్నికల ఖర్చు పరిశీలకులు అందరూ సిద్ధంగా ఉన్నారని తెలిపారు. బిహార్ ఎన్నికలు పారదర్శకత, సామర్థ్యం, ప్రజాస్వామ్య స్ఫూర్తికి ఉదాహరణగానే గాక మొత్తం ప్రపంచానికి ఒక నమూనాగా నిలుస్తాయని ధీమా వ్యక్తం చేశారు.

# రాజస్థాన్‌లో మరో బస్సు ప్రమాదం 18 మంది దుర్మరణం

**జైపూర్/పుణె/థాణె, నవంబరు 2:** ఏసీ బస్సు దగ్ధమైన సంఘటన మరవక ముందే రాజస్థాన్‌లో ఆదివారం మరో బస్సు ప్రమాదం సంభవించింది. నిలిపి ఉన్న ట్రయిలర్‌ను బస్సు ఢీకొనడంతో 18 మంది ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయారు. మరో ముగ్గురు గాయపడ్డారు. రాజధాని జైపూర్‌కు 400 కి.మీ.దూరంలోని ఫాలోడి జిల్లాలో ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. పర్యాటక కేంద్రమైన జోధ్‌పూర్ జిల్లాలోని సుర్‌సాగర్, బికనేర్ జిల్లాలోని పుణ్యక్షేత్రమైన కోలాయత్‌లను సందర్శించుకొని తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. బాధితులను అన్ని విధాలుగా ఆదుకుంటామని సీఎం భజన్‌లాల్ శర్మ తెలిపారు. ఈ బస్సు ప్రమాదం పట్ల ప్రధాని మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తపరిచారు. పీఎం సహాయనిధి నుంచి మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50 వేలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. గత నెలలో జైసల్మేర్ జిల్లాలో ఏసీ బస్సులో మంటలు వ్యాపించడంతో 26 మంది మరణించారు. అప్పటి నుంచి అధికారులు బస్సులను తనిఖీలు చేస్తున్నప్పటికీ ప్రమాదం జరగడం గమనార్హం. మరోవైపు, మహారాష్ట్రలోని పుణెలో ఆదివారం వేకువజామున అతి వేగంగా వెళ్తున్న కారు మెట్రో పిల్లర్‌ను ఢీకొనడంతో ముగ్గురు మరణించారు. మద్యం సేవించి కారును నడపడమే ఈ ప్రమాదం కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు. థానేలో మోటారు సైకిల్‌ను ఓ లారీ ఢీకొనడంతో రెండున్నర ఏళ్ల బాలుడు సంఘటన స్థలంలోనే మరణించాడు.

# రోడ్డు ప్రమాదాలకు ఇకపై కాంట్రాక్టర్‌కు జరిమానా

**కేంద్ర రహదారుల మంత్రిత్వ శాఖ నిర్ణయం**

న్యూఢిల్లీ, నవంబరు 2: రోడ్డు ప్రమాదాలు, మరణాలను తగ్గించేందుకు జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. బీవోటీ (నిర్మాణం-నిర్వహణ-బదిలీ) పద్ధతిలో నిర్మించిన జాతీయ రహదారుల నిర్దిష్ట పరిధిలో (500 మీటర్లు) ఏడాదిలో ఒకటి కంటే ఎక్కువ రోడ్డు ప్రమాదాలు జరిగితే కాంట్రాక్టర్లపై రూ.25 లక్షల జరిమానా విధించనున్నట్లు ప్రభుత్వ సీనియర్ అధికారి ఒకరు ఆదివారం వెల్లడించారు. జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ బీవోటీ డాక్యుమెంట్‌ను సవరించిందని రోడ్డు రవాణా, హైవేల శాఖ కార్యదర్శి వి.ఉమాశంకర్ తెలిపారు. కాంట్రాక్టర్లు రోడ్డు ప్రమాదాలకు బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఒక ఏడాదిలో హైవేలోని నిర్దిష్ట పరిధిలో ఒకటి కంటే ఎక్కువసార్లు రోడ్డు ప్రమాదాలు జరిగితే సదరు కాంట్రాక్టర్ రూ.25 లక్షలు జరిమానాగా చెల్లించాలని, తర్వాతి ఏడాది కూడా ప్రమాదాలు పునరావృతమైతే ఫైన్ రూ.50 లక్షలకు పెరుగుతుందని తెలిపారు. హైవేల మంత్రిత్వ శాఖ దేశవ్యాప్తంగా 3,500 రోడ్డు ప్రమాదాల స్ట్రెచ్‌లను గుర్తించిందన్నారు. రోడ్డు ప్రమాద బాధితులకు ఆస్పత్రుల్లో నగదు రహితంగా చికిత్స అందించే పథకాన్ని ప్రభుత్వం త్వరలోనే ప్రారంభించనుందని ఉమాశంకర్ చెప్పారు. కాగా, హైవేల నిర్మాణాలను ప్రధానంగా బీవోటీతో పాటు హైబ్రిడ్ యాన్యుటీ మోడల్(ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యం), ఇంజనీరింగ్ ప్రొక్యూర్‌మెంట్ అండ్ కన్‌స్ట్రక్షన్(ఈపీసీ) పద్ధతుల్లో చేపడుతారు. నిర్వహణతో సహా ప్రాజెక్టులకు రాయితీ కాలం బీవోటీ మోడల్‌లో 15-20 సంవత్సరాలు ఉండగా, హెచ్ఏఎంలో 15 ఏళ్లు ఉంటుంది.



# ఉమెన్స్ వరల్డ్ కప్ మనదే!!

**ఫైనల్లో సత్తా చాటిన ఉమెన్స్**
**సౌత్ ఆఫ్రికన్స్ ను మట్టికరిపించిన భారత్**
**తొలిసారి వన్డే ప్రపంచకప్ కైవసం**
**ఫైనల్లో దక్షిణాఫ్రికాపై అద్భుత విజయం**
**అదరగొట్టిన షెఫాలీవర్మ, దీప్తిశర్మ**
**వోల్వార్డ్ సెంచరీ పోరాటం వృథా**

భారత క్రికెట్ చరిత్రలో చిరస్మరణీయ సందర్భం! ఏండ్లుగా ఊరిస్తూ వస్తున్న వన్డే ప్రపంచకప్ ట్రోఫీ ఎట్టకేలకు భారత్ దరిచేరింది. సొంత ఇలాఖాలో తమ కలల కప్‌ను తొలిసారి సాకారం చేసుకుంది. ఆద్యంతం ఆసక్తికరంగా సాగిన ఫైనల్లో దక్షిణాఫ్రికాను చిత్తు చేసి టీమ్‌ఇండియా జగజ్జేతగా నిలిచింది. షెఫాలీవర్మ, దీప్తిశర్మ అర్ధసెంచరీలతో భారీ స్కోరు అందుకున్న భారత్..స్ఫూర్తిదాయక పోరాటంతో కదంతొక్కింది. లక్ష్యఛేదనలో సఫారీ కెప్టెన్ లారా వోల్వార్డ్ సెంచరీ పోరాటం సఫలం కాలేకపోయింది. దీప్తిశర్మ ఐదు వికెట్ల విజృంభణతో సఫారీలు రన్నరప్‌తో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. కోట్లాది భారతీయుల ఆకాంక్షలను నిజం చేస్తూ భారత మహిళామణులు మువ్వన్నెల పతాకాన్ని సగర్వంగా రెపరెపలాడించారు.





ముంబై: దశాబ్దాలుగా ఊరిస్తున్న ఐసీసీ మహిళల వన్డే ప్రపంచకప్‌ను స్వదేశంలో భారత జట్టు సగర్వంగా ముద్దాడింది. ఆదివారం సుమారు 40వేల మంది అభిమానుల సమక్షంలో నవీ ముంబైలోని డీవై పాటిల్ స్టేడియం వేదికగా జరిగిన ఫైనల్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని ఉమెన్ ఇన్ బ్లూ.. దక్షిణాఫ్రికాను 52 పరుగుల తేడాతో మట్టికరిపించి కొత్త చరిత్ర సృష్టించింది. భారత్ నిర్దేశించిన భారీ ఛేదనలో సౌతాఫ్రికా.. 45.3 ఓవర్లలో 246 పరుగుల వద్దే ఆగిపోయి తొలి కప్పు కలకు దూరమైంది. ఛేదనలో సారథి లారా వోల్వార్డ్ (98 బంతుల్లో 101, 11 ఫోర్లు, 1 సిక్స్) బ్యాక్ టు బ్యాక్ శతకంతో కదం తొక్కినా మిగిలిన బ్యాటర్లు విఫలమవడం ఆ జట్టును దెబ్బతీసింది. బ్యాట్‌తో మెరిసిన దీప్తి.. బంతితోనూ (5/39) కీలక వికెట్లు తీసి సఫారీల నడ్డి విరిచింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన భారత్.. నిర్ణీత ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 298 పరుగులు సాధించింది. షెఫాలీ వర్మ (78 బంతుల్లో 87, 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) సాధికారిక ఇన్నింగ్స్‌కు తోడు దీప్తి (58 బంతుల్లో 58, 3 ఫోర్లు, 1 సిక్స్), స్మృతి మంధాన (58 బంతుల్లో 45, 8 ఫోర్లు) రాణించారు. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' షెఫాలీకి దక్కగా టోర్నీలో 215 రన్స్, 22 వికెట్లతో సత్తాచాటిన దీప్తి 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నీ'గా ఎంపికైంది.

**షెఫాలీ దూకుడు..**

నాకౌట్ దశలో జట్టులోకి వచ్చిన షెఫాలీ.. కీలక మ్యాచ్‌లో సత్తాచాటింది. దూకుడు, సంయమనం కలగలిపి ఆడిన ఆమె.. జట్టు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని వందశాతం నిలబెట్టుకుంది. తొలి వికెట్‌కు స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన (58 బంతుల్లో 45, 8 ఫోర్లు)తో కలిసి 104 పరుగులు జోడించి బలమైన పునాది వేసింది. ఖాకా రెండో ఓవర్లోనే ముందుకొచ్చి ఆడిన ఆమె.. కాప్ బౌలింగ్‌లోనూ అదే దూకుడును ప్రదర్శించింది. మరో ఎండ్‌లో స్మృతి ఆఫ్‌సైడ్ దిశగా తనదైన ట్రేడ్‌మార్క్ డ్రైవ్‌లు, లేట్‌కట్, స్వీప్ షాట్లతో అలరించింది. కానీ పవర్ ప్లే తర్వాత స్కోరువేగం క్రమంగా మందగించింది. అర్ధశతకానికి చేరువవుతున్న క్రమంలో ట్రయాన్ వేసిన 18వ ఓవర్లో నాలుగో బంతి స్మృతి బ్యాట్ ఎడ్జ్‌కు తాకి కీపర్ జాఫ్టా చేతుల్లో పడటంతో తొలి వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. అదే ఓవర్లో ఆఖరి బంతికి సింగిల్‌తో షెఫాలీ ఫిఫ్టీ పూర్తయింది. స్మృతి స్థానంలో వచ్చిన జెమీమా (24)తో కలిసి షెఫాలీ స్కోరువేగాన్ని పెంచింది. ఇద్దరూ వికెట్ల మధ్య వేగంగా పరిగెత్తుతూ రన్‌రేట్ పడిపోకుండా జాగ్రత్తపడ్డారు. శతకం దిశగా సాగుతున్న షెఫాలీ.. ఖాకా 28వ ఓవర్లో భారీ షాట్ ఆడబోయి మిడాఫ్‌లో లుస్ చేతికి చిక్కడం జట్టును దెబ్బతీసింది.

**తడబాటుకు గురై..**

షెఫాలీ నిష్క్రమణ తర్వాత భారత బ్యాటింగ్ లైనప్ తడబడింది. ఖాకా.. 30వ ఓవర్లో జెమీమాను ఔట్ చేయగా భారత్ భారీ ఆశలు పెట్టుకున్న కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (20)ను ఎంలబా బౌల్డ్ చేసింది. దీప్తి వేగంగా ఆడలేకపోయినా వికెట్ల పతనాన్ని అడ్డుకుని సంయమనాన్ని ప్రదర్శించింది. అమన్‌జ్యోత్ (12) వేగంగా ఆడలేక డి క్లెర్క్ బౌలింగ్‌లో ఆమెకే క్యాచ్ ఇచ్చి వెనుదిరిగింది. అయితే ఏడో స్థానంలో వచ్చిన రిచా (24 బంతుల్లో 34, 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరుపులు మెరిపించడంతో భారత్ ప్రత్యర్థి ఎదుట పోరాడగలిగే స్కోరును నిర్దేశించగలిగింది.

**వోల్వార్డ్ పోరాటం**

రికార్డు ఛేదనను సఫారీలూ నిలకడగానే ఆరంభించారు. తొలి వికెట్‌కు హాఫ్ సెంచరీ భాగస్వామ్యం తర్వాత తజ్మిన్ బ్రిట్స్ (23).. అమన్‌జ్యోత్ సూపర్ త్రో తో భారత్‌కు తొలి వికెట్ దక్కింది. శ్రీచరణి.. బోష్‌ను వికెట్ల ముందు దొరకబుచ్చుకుంది. కానీ మరో ఎండ్‌లో వోల్వార్డ్ మరోసారి బాధ్యతాయుతంగా ఆడింది. వీలుచిక్కినప్పుడల్లా బంతిని బౌండరీకి తరలిస్తూ స్కోరుబోర్డును ముందుకు నడిపించింది. సునె లుస్ (25)తో కలిసి మూడో వికెట్‌కు 52 రన్స్ జోడించి ఆ జట్టును లక్ష్యం దిశగా నడిపించింది. రాధా యాదవ్ 17వ ఓవర్లో బౌండరీతో ఆమె అర్ధ శతకం పూర్తయింది. అయితే 21వ ఓవర్లో హర్మన్.. షెఫాలీకి బంతినివ్వడంతో ఆమె వరుస ఓవర్లలో లుస్, మరిజనె కాప్‌ను పెవిలియన్‌కు పంపింది. జాఫ్టా (16)ను దీప్తి ఔట్ చేసి ఒత్తిడి పెంచాలని చూసింది. కానీ అనెరి డెర్క్‌సెన్ (35) వేగంగా ఆడింది. రాధా 32వ ఓవర్లో ఆమె రెండు భారీ సిక్సర్లు బాదింది. డెర్క్‌సెన్, లారా ద్వయం స్ట్రైక్ రొటేట్ చేస్తూ ఆరో వికెట్‌కు 61 రన్స్ జోడించారు.

**సంక్షిప్త స్కోర్లు**

భారత్: 50 ఓవర్లలో 298/7 (షెఫాలీ 87, దీప్తి 58, ఖాకా 3/58, ట్రయాన్ 1/46)బీ దక్షిణాఫ్రికా: 45.3 ఓవర్లలో 246 ఆలౌట్ (వోల్వార్డ్ 101, డెర్క్‌సెన్ 35, దీప్తి 5/39, షెఫాలీ 2/36)

**దీప్తి మ్యాజిక్**

ప్రమాదకరంగా పరిణమిస్తున్న లారా, డెర్క్‌సెన్ ద్వయాన్ని దీప్తి శర్మ విడదీసి భారత్‌ను తిరిగి పోటీలోకి తెచ్చింది. 40వ ఓవర్లో ఆమె.. డెర్క్‌సెన్‌ను క్లీన్‌బౌల్డ్ చేసి మ్యాచ్‌ను మన వైపు తిప్పింది. అదే ఓవర్లో ఐదో బంతికి సింగిల్ తీసిన లారా.. వరుసగా రెండో శతకాన్ని నమోదుచేసింది. 42వ ఓవర్లో దీప్తి.. సఫారీలకు డబుల్ షాకులిచ్చింది. తొలి బంతిని డీప్ మిడ్ వికెట్ మీదుగా ఆడిన లారా.. అమన్‌జ్యోత్ క్యాచ్ అందుకోవడంతో నిష్క్రమించింది. నాలుగో బంతికి ట్రయాన్ (9)ను వికెట్ల ముందు బలిగొంది. తన 46వ ఓవర్లో డి క్లెర్క్ (18) ఇచ్చిన క్యాచ్‌ను హర్మన్‌ప్రీత్ అందుకుని 140 కోట్లాది అభిమానుల కలను నెరవేర్చింది.

# మూడో టీ20లో సుందర విజయం

**బ్యాట్‌తో మెరిసిన వాషింగ్టన్.. మూడో టీ20లో భారత్ విక్టరీ**
**ఆసీస్‌ను కట్టడిచేసిన అర్ష్‌దీప్ సిరీస్ 1-1తో సమం**




హోబర్ట్: ఆస్ట్రేలియా పర్యటనలో భారత పురుషుల జట్టు బోణీ కొట్టింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా హోబర్ట్ వేదికగా ముగిసిన మూడో టీ20లో టీమ్‌ఇండియా.. 5 వికెట్ల తేడాతో ఆసీస్‌ను చిత్తుచేసి సిరీస్‌ను 1–1తో సమం చేసింది. ఆతిథ్య జట్టు నిర్దేశించిన 187 పరుగుల ఛేదనను భారత్ మరో 9 బంతులు మిగిలుండగానే దంచేసింది. వాషింగ్టన్ సుందర్ (23 బంతుల్లో 49 నాటౌట్, 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) మెరుపు బ్యాటింగ్‌కు తోడు తిలక్ వర్మ (29), అభిషేక్ శర్మ (25) రాణించారు. మొదట బ్యాటింగ్ చేసిన ఆసీస్.. నిర్ణీత ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 186 రన్స్ చేసింది. టిమ్ డేవిడ్ (38 బంతుల్లో 74, 8 ఫోర్లు, 5 సిక్స్‌లు), మార్కస్ స్టోయినిస్ (39 బంతుల్లో 64, 8 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ శతకాలతో ఆ జట్టుకు భారీ స్కోరునందించారు. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అర్ష్‌దీప్ సింగ్ (3/35), వరుణ్ చక్రవర్తి (2/33) ఆ జట్టును కట్టడిచేశారు. ఇరుజట్ల మధ్య నాలుగో మ్యాచ్ ఈనెల 6న జరుగుతుంది.

**వాషి.. ఓ వాషి..**

భారీ ఛేదనను అభిషేక్ ఎప్పట్లాగే దంచుడుతో మొదలుపెట్టాడు. సిక్సర్‌తో పరుగుల వేటను ఆరంభించిన అతడు.. అబాట్ రెండో ఓవర్లో 4, 6, 6తో 17 రన్స్ పిండుకున్నాడు. కానీ ఎల్లీస్ 4వ ఓవర్లో వేసిన షార్ట్ బాల్ మిడ్ వికెట్ మీదుగా ఆడబోయినా బంతి బ్యాట్ ఎడ్జ్‌కు తాకడంతో కీపర్‌కు క్యాచ్ ఇచ్చాడు. గిల్ (15) మళ్లీ విఫలమయ్యాడు. కెప్టెన్ సూర్య (11 బంతుల్లో 34, 1 ఫోర్, 2 సిక్స్‌లు) రెండు సిక్సర్లతో ఊపు మీదే కనిపించినా స్టోయినిస్ 8వ ఓవర్లో స్లో డెలివరీకి బలయ్యాడు. అక్షర్ పటేల్ (17) కూడా ఎక్కువసేపు క్రీజులో నిలువలేకపోయాడు. తిలక్ వర్మ క్రీజులో ఉన్నా వేగంగా ఆడలేకపోయాడు. అక్షర్ నిష్క్రమణతో క్రీజులోకి వచ్చిన వాషింగ్టన్.. ఎదుర్కొన్న తొలి బంతినే మిడ్ వికెట్ మీదుగా సిక్స్ కొట్టాడు. అబాట్ 14వ ఓవర్లో 4, 6, 6తో 19 పరుగులు రావడంతో భారత్ విజయం ఖరారైంది. ఆ తర్వాత తిలక్ నిష్క్రమించినా జితేశ్ (13 బంతుల్లో 22లి, 3 ఫోర్లు) అండతో వాషింగ్టన్ గెలుపు లాంఛనాన్ని పూర్తిచేశాడు.

**డేవిడ్, స్టోయినిస్ మెరుపులు**

టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన ఆసీస్ ఇన్నింగ్స్‌కు అర్ష్‌దీప్ ఆరంభంలోనే షాకులిచ్చాడు. ఇన్నింగ్స్ తొలి ఓవర్ నాలుగో బంతికే అతడు ప్రమాదకర హెడ్ (6)ను ఔట్ చేశాడు. తన మరుసటి ఓవర్లో జోష్ ఇంగ్లిస్ (1)నూ వెనక్కి పంపాడు. బ్యాటింగ్ ఆర్డర్‌లో ప్రమోషన్ పొందిన డేవిడ్.. ఆరంభం నుంచే భారత్‌పై ఎదురుదాడికి దిగాడు. వరుణ్ ఐదో ఓవర్లో 4,6 బాదిన అతడు. 21 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద బుమ్రా బౌలింగ్‌లో కవర్ పాయింట్ వద్ద వాషింగ్టన్ క్యాచ్ జారవిడవడంతో బతికిపోయాడు. దూబె బౌలింగ్‌లో మూడు ఫోర్లు కొట్టి 23 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తిచేశాడు. 9వ ఓవర్లో వరుణ్.. మార్ష్ (11)తో పాటు ఓవెన్ (0)నూ ఔట్ చేసినా డేవిడ్‌కు స్టోయినిస్ జతకలిశాడు. దూబె 13వ ఓవర్లో స్టోయినిస్ రెండు భారీ సిక్సర్లు కొట్టాడు. కానీ ఆ ఓవర్ చివరి బంతికి డేవిడ్.. లాంగాఫ్ వద్ద తిలక్ సూపర్ క్యాచ్ పట్టడంతో పెవిలియన్ చేరాడు. ఆఖర్లో షార్ట్ (26లి)తో కలిసి స్టోయినిస్ ఆసీస్ భారీ స్కోరు చేసింది.

**సంక్షిప్త స్కోర్లు**

ఆస్ట్రేలియా: 20 ఓవర్లలో 186/6 (డేవిడ్ 74, స్టోయినిస్ 64, అర్ష్‌దీప్ 3/35, వరుణ్ 2/33)బీ భారత్: 18.3 ఓవర్లలో 188/5 (వాషింగ్టన్ 49లి, తిలక్ 29, ఎల్లీస్ 3/36, స్టోయినిస్ 1/22)

## టీ20లకు విలియమ్సన్ వీడ్కోలు



ఆక్లాండ్: న్యూజిలాండ్ మాజీ సారథి కేన్ విలియమ్సన్ అంతర్జాతీయ టీ20 కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. స్వదేశంలో వెస్టిండీస్‌తో జరుగబోయే ఐదు మ్యాచ్‌ల సిరీస్‌కు ముందే అతడు తన నిర్ణయాన్ని ప్రకటించాడు. 2011లో టీ20 కెరీర్ ఆరంభించిన అతడు.. కివీస్ తరఫున 93 మ్యాచ్‌లకు ప్రాతినిధ్యం వహించి 2,575 రన్స్ చేశాడు. బ్యాటర్‌గానే గాక 75 మ్యాచ్‌ల్లో కివీస్‌కు సారథిగా వ్యవహరించాడు. కెప్టెన్‌గా ఆ జట్టును 2016, 2022లో సెమీస్‌కు చేర్చిన కేన్ మామ.. 2021లో ఫైనల్ చేరడంలో కీలకపాత్ర పోషించాడు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
Roaming News





## రష్మిక సినిమా లేడీ ఓరియేంటెడ్ కాదా?

నేషనల్ క్రష్ రష్మికా మందన్నా పాన్ ఇండియాలో ఓ బ్రాండ్ అని చెప్పాల్సిన పనిలేదు. అమ్మడు ఏ భాషలో నటిం చినా? రష్మిక పేరుతో మార్కెట్ లోకి వెళ్లిపోతుంది. టాలీవుడ్ మొదలు బాలీవుడ్ వరకూ అంతా రష్మిక జపమే. ఇలా ఫేమస్ అయితే ఆ ప్రభావం సినిమా కంటెంట్ పై కూడా పడుతుందని తాజాగా వెలుగులోకి వచ్చింది. ప్రస్తుతం ఈ బ్యూటీ %-%ది గర్ల్ ఫ్రెండ్%-% అనే సినిమాలో నటిస్తోన్న సంగతి తెలిసిందే. ఈసినిమాని తొలి నుంచి లేడీ ఓరియేంటెడ్ చిత్రంగానే హైలైట్ అయింది. టైటిల్ కూడా అలాగే ఉండటంతో ప్రేక్షకులు అదే నిజమని నమ్మారు. కానీ అసలు సంగతేంటి అంటే ఇది లేడీ ఓరియేంటెడ్ చిత్రం కాదని నిర్మాత ప్రకటించారు. ఈ చిత్రాన్ని ఓ లవ్ స్టోరీగా చెప్పుకొచ్చారు. ప్రేక్షకులపై గాఢమైన ప్రభావం చూపించే ప్రేమ కథల్ని ఎంపిక చేసుకుంటూ సినిమాలు చేస్తున్నాం అన్నారు. %-%ది గర్ల్ ఫ్రెండ్%-% కూడా అలాంటి కథే అంటూ నిర్మాత ధీరజ్ మొగిలినేని ప్రకటించారు. రాహుల్ రవీంద్రన్ ఈ చిత్రిన్ని తెరకెక్కిస్తోన్న సంగతి తెలిసిందే. పాన్ ఇండియాలో ఈసినిమా రిలీజ్ కు రెడీ అవుతుంది. ఈ నేపథ్యంలో సినిమా స్టోరీ కూడా బయటకు వచ్చింది. ఇది కాలేజ్ బ్యాక్ డ్రాప్ లో సాగే లవ్ స్టోరీ. కేవలం నాయిక కోణంలోనే కథ సాగుతుందిట. ఇందులో హీరోగా దీక్షిత్ నటిస్తున్నట్లు తెలిపారు. రష్మికకు ఈ కథ నచ్చడంతో ఎలాంటి పారితోషికం తీసుకోకుండా పనిచేసిందన్నారు. అయితే రిలీజ్ అనంతరం రెట్టించిన పారితోషికం చెల్లిస్తామన్నారు. ఇంత వరకూ రష్మిక నటిస్తోన్న మరో లేడీ ఓరియేంటెడ్ చిత్రంగా జనాల్లోకి వెళ్లింది. రష్మిక కూడా ఇంత వరకూ లేడీ ఓరియేంటెడ్ సినిమా చేయలేదు. %-%ది గర్ల్ ఫ్రెండ్%-% ప్రచార చిత్రాలకు మంచి బజ్ రావడంతో? సినిమాపై అంచనాలు పెరిగాయి. లేడీ నాయికగానూ సత్తా చాటుతుందని అంచనాలు ఏర్పడ్డాయి. జనాల్లోకి కూడా అలాగే వెళ్లింది. తాజాగా నిర్మాత ప్రకటనతో సన్నివేశం మారుతుందా? అన్నది చూడాలి. సినిమా రిలీజ్ కు ఇంకా ఐదు రోజులు సమయం ఉంది. అయితే నిర్మాత చివరి వరకూ అసలు విషయాన్ని చెప్పకపోవడం వెనుక పబ్లిసిటీ కారణం కూడా ఉండొచ్చు అన్న సందేహం వ్యక్తమవుతుంది. లేడీ ఓరియేంటెడ్ చిత్రం కాదని చెప్పకపోతే సినిమా జనాల్లోకి వెళ్లదా? అన్న సందేహంతోనే ఇలాంటి స్ట్రాటజీ అనుసరించారా? అంటూ చర్చ మొదలైంది.



## సమంత ఛాన్స్ కళావతి తన్నుకుపోయిందా?

టాలీవుడ్ హీరోయిన్ల మధ్య బాలీవుడ్ లో పోటీ నెలకొందా? ఒకరి అవకాశం కోసం మరొకరు పోటీ పడుతున్నారా? అంటే సన్నివేశం అలాగే కనిపిస్తోంది. ఇప్పటికే నేషనల్ క్రష్ రష్మికా మందన్నా బాలీవుడ్ లో పాగా వేసిన సంగతి తెలిసిందే. వరుస అవకాశాలో బాలీవుడ్ భామలకే పోటీగా మారింది. సీనియర్ హీరోయిన్లకే అమ్మడు అక్కడ చెమటలు పట్టిస్తోంది. ఫలానా సినిమాలో తాను నటించాలని కర్చీఫ్ వేసిందంటే? దాన్ని తొలగించే సాహసం ఏ నటి చేయలేకపోతుంది. అలాగే సమంత, కీర్తి సురేష్ లాంటి భామల మధ్య కూడా పోటీ నెలకొంది? అన్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

ఏకంగా సీనియర్ అయిన సమంతనే పక్కన బెట్టి కీర్తి సురేష్‌ని ఓ ప్రాజెక్ట్ కి ఎంపిక చేసారు? అన్నది బాలీవుడ్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. రాజ్ కుమార్ రావు హీరోగా ఆదిత్య నింబాల్కర్ ఓ చిత్రానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో హీరోయిన్ గా తొలుత సమంతను తీసుకోవాలనుకున్నారుట. దీనిలో భాగంగా విషయం కూడా ఆమెకు చెప్పి ఆఫీస్ కు పిలిపించారుట. ఆమె తోపాటు మరో నాయికగా తాన్యా మణిక్తి తో కూడా చర్చలు జరిపారుట. కానీ ఏం జరిగిందో తెలియదు గానీ సమంత స్థానంలో ఇప్పుడు మరో సౌత్ నటి అయిన కీర్తి సురేష్‌ని ఎంపిక చేసినట్లు వార్తలొస్తున్నాయి.

ఆ పాత్రకు సామ్ కంటే కీర్తి అయితే పర్ఫెక్ట్ గా సూటువుతుందని మేకర్స్ భావించే ఈ నిర్ణయానికి వచ్చినట్లు వినిపిస్తోంది. మరి ఇందులో వాస్తవాలు తెలియాల్సి ఉంది. సమంత కూడా కొంత కాలంగా బాలీవుడ్ అవకాశాల కోసం ఎంత సీరియస్ గా ప్రయత్నిస్తుందో తెలిసిందే? కీర్తి సురేష్ కూడా బాలీవుడ్ కి వెళ్లినా? ఆమె కంటే సామ్ సీరియస్ గా ఛాన్సు ల కోసం ట్రై చేస్తోంది. ఇప్పటికే అక్కడ ట్రెండ్ కు తగ్గట్టు మౌల్డ్ అయింది. పరిచయాలు అంతకంతకు పెంచుకుంటుంది. రిలేషన్ షిప్స్ విషయంలోనూ అమ్మడు అంతే ఓపెన్ గా ఉంటుంది.

## పొట్టి డ్రెస్సులో అనన్య..

'మల్లేశం' సినిమాతో తెలుగు తెరకు పరిచయమై, 'వకీల్ సాబ్'తో యూత్లో మంచి క్రేజ్ సంపాదించుకుంది అనన్య నాగళ్ల. ఈ తెలుగమ్మాయి తన నటనతోనే కాకుండా, సోషల్ మీడియాలో గ్లామరస్ ఫొటోషూట్లతోనూ తరచుగా వార్తల్లో నిలుస్తోంది. అచ్చమైన తెలుగింటి అమ్మాయిలా కనిపించే అనన్య, ఈ మధ్య కాలంలో తన ఇమేజ్కు భిన్నంగా స్టైలిష్ లుక్స్తో ఆకట్టుకుంటోంది. లేటెస్ట్ గా అనన్య పోస్ట్ చేసిన ఫొటోలు సోషల్ మీడియాలో హల్చల్ చేస్తున్నాయి. ఎరుపు రంగు షార్ట్ డ్రెస్లో ఈ బ్యూటీ అల్ట్రా మోడ్రన్గా కనిపిస్తోంది. ఒక ఫొటోలో ఐస్క్రీమ్ తింటూ, మరో ఫొటోలో స్టైలిష్గా నడుస్తూ, ఇంకో ఫొటోలో కేఫ్లో కూర్చుని.. ఇలా భిన్నమైన పోజులతో ఫ్యాన్స్ను కట్టిపడేసింది. ఈ ఫొటోలలో ఆమె, స్టైల్కు నెటిజన్లు ఫిదా అవుతున్నారు. ప్రియదర్శి హీరోగా నటించిన 'మల్లేశం' చిత్రంతో అనన్య నాగళ్ల ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చింది. తొలి సినిమాలోనే తన సహజమైన నటనతో విమర్శకుల ప్రశంసలు అందుకుంది. ఆ తర్వాత 'ప్లే బ్యాక్' వంటి చిత్రాల్లో నటించినా, పవర్ స్టార్ పవన్ కల్యాణ్ నటించిన 'వకీల్ సాబ్'లో కీలక పాత్ర పోషించి.. ఒక్కసారిగా అందరి దృష్టినీ ఆకర్షించింది. ఈ సినిమా ఆమెకు మంచి బ్రేక్ ఇచ్చింది.


సినిమాలతో ఎంత బిజీగా ఉన్నా, అనన్య సోషల్ మీడియాలో మాత్రం చాలా చురుగ్గా ఉంటుంది. ట్రెడిషనల్ లుక్స్తో పాటు, ఇలాంటి స్టైలిష్ ఫొటోషూట్లను కూడా పంచుకుంటూ తన ఫాలోవర్స్ను ఎంటర్టైన్ చేస్తోంది. గ్లామర్లోనూ ఏ హీరోయిన్కు తీసిపోనని నిరూపిస్తూ, ఇండస్ట్రీలో తనకంటూ ఓ ప్రత్యేక స్థానం కోసం గట్టిగా ప్రయత్నిస్తోంది.

## నెల తిరగకుండానే ఓటీటీలోకి డ్యూడ్

కొన్ని కొన్ని చిత్రాలు ఓటీటీ ఫ్లాట్ ఫామ్ లతో చేసుకునే ఒప్పందం ప్రకారం స్ట్రీమింగ్ కి వచ్చేస్తూ ఉంటాయి. అందులో కొన్ని చిత్రాలు నెల తిరగకుండానే ఓటీటీ లోకి వస్తే.. మరికొన్ని చిత్రాలు విడుదలైన ఎనిమిది వారాలకు ఓటీటీలోకి వస్తాయి. ఇంకొన్ని చిత్రాలకు ఓటీటీ డీల్ కుదరక ఏడాది గడిచినా ఓటీటీలోకి స్ట్రీమింగ్ కి అందుబాటులోకి రావని చెప్పాలి. అయితే ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చి తమిళ్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకొని, ఇప్పుడు ఓటీటీ స్ట్రీమింగ్ కి నెల తిరగకుండానే వచ్చేస్తోంది యూత్ ఫుల్ ఎంటర్టైనర్ డ్యూడ్.

ప్రముఖ డైరెక్టర్ కం హీరో ప్రదీప్ రంగనాథన్ హీరోగా.. ప్రేమలు సినిమాతో ఓవర్ నైట్ లోనే భారీ పాపులారిటీ అందుకున్న మమిత బైజు హీరోయిన్గా వచ్చిన ఈ సినిమా అక్టోబర్ 17వ తేదీన దీపావళి సందర్భంగా థియేటర్లలో విడుదలై సందడి చేసింది. ఇటు 100 కోట్ల క్లబ్లో చేరిన ఈ సినిమా ప్రదీప్ రంగనాథన్ కెరియర్లో 100 కోట్ల క్లబ్లో చేరిన మూడవ చిత్రంగా రికార్డు సృష్టించింది. అయితే ఇప్పుడు ఈ సినిమా ఓటీటీ ప్రియులను అలరించడానికి నెల తిరగకుండానే ఓటీటీ స్ట్రీమింగ్ కి సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ ప్లాట్ఫారం భారీ ధరకు సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. ఇకపోతే ప్రముఖ ఓటీటీ ప్లాట్ఫామ్ నెట్ ఫ్లిక్స్ తక్కువ థియేటర్ విండో పద్ధతిని అనుసరిస్తున్న విషయం తెలిసిందే. అంటే ఏ సినిమాలైనా సరే విడుదలైన నాలుగు వారాల తర్వాత ఓటిటి ప్లాట్ఫామ్ స్ట్రీమింగ్ కి వస్తాయి. ఇప్పుడు డ్యూడ్ కూడా ఇదే విధానాన్ని అనుసరిస్తోంది. అయితే రెండు రోజులు ముందుగానే ఈ సినిమా స్ట్రీమింగ్ కి సిద్ధమవుతూ ఉండడం గమనార్హం.

నవంబర్ 14 శుక్రవారం నుండి నెట్ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్ కి అందుబాటులోకి రాబోతోంది. అయితే త్వరలో దీనిపై అధికారిక ప్రకటన వెలువడనుంది. ఇకపోతే నెల తిరగకుండానే ఓటీటీలోకి రాబోతుండడంతో భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. థియేటర్లలో సినిమా చూడలేకపోయినా వారికి ఓటిటి లోకి రావడం ఒక శుభవార్త అయినా.. మరొకవైపు థియేటర్ రన్ ను ఇది ప్రభావితం చేస్తుందని.. మరికొంతమంది కామెంట్లు చేస్తున్నారు. ఫలితంగా కలెక్షన్లు కూడా తగ్గే ప్రమాదం ఉందని సమాచారం. మరి దీనిపై నెట్ఫ్లిక్స్ అధికారికంగా ప్రకటించే వరకు ఎదురు చూడాల్సిందే. డ్యూడ్ సినిమా విషయానికి వస్తే.. మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్ పై నవీన్ ఎర్నేని, వై రవిశంకర్ నిర్మించిన ఈ చిత్రానికి కీర్తిశ్వరన్ దర్శకత్వం వహించారు. శరత్ కుమార్, నేహా శెట్టి , రోహిణి తదితరులు కీలక పాత్రలు పోషించారు. అక్టోబర్ 9న ఈ సినిమా ట్రైలర్ రిలీజ్ చేయగా..అక్టోబర్ 17న తెలుగుతో పాటు తమిళ్లో కూడా విడుదలైంది.



Printed, published and owened by GOTTIPARTHI MADHURI, printed at MADHURI OFFSET PRINTERS H.NO 3-133, BC colony yadagirigutta, dist : Yadadri Buvanagiri pin : 508115, Ts Publictions at Madhuri publications. Editor : GOTTIPARTHI BHASKER. RNA TELTEL /2021/80986